www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00



ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

✆ : 99484 33277 / 7288825681



Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 244 | గురువారం | 20 ఫిబ్రవరి, 2025




02

## ఛత్రపతి శివాజీకి సీఎం నివాళి



# వందశాతం అధికారం మళ్లీ మనదే

- కాంగ్రెస్ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ సభ్యత్వ నమోదు, ప్లీనరీపై చర్చ
- బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్

### అన్నిరంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** తెలంగాణలో మళ్లీ వందశాతం అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఇక దృష్టి పెడతానని కేసీఆర్ అన్నారు. బుధవారం ఉదయం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని ప్రకటించారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్టోబర్, నవంబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో

మిగతా 2 లో

## పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ అమలు

- ఎల్ఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం, మంత్రుల సమీక్ష



02



## కమాండ్ కంట్రోల్‌లోకి గుర్తు తెలియని వ్యక్తి

సీరియస్‌గా తీసుకున్న పోలీసు అధికారులు

02



## సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు

02



## రైతులకు కేంద్రం శుభవార్త

- 24న పీఎం కిసాన్ నిధులు విడుదల

02

## వరద సాయం విడుదల

- తెలంగాణ, ఏపీకి కేటాయింపులు



## పరిమితికి మించి టికెట్లు ఎందుకు అమ్మారు?



02

- ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటలో 18 మంది మృతిపై హైకోర్టు ఆగ్రహం
- వివరణ ఇవ్వాలని కేంద్రం, రైల్వే శాఖకు ఆదేశం



## భర్తకు సేవ చేయాల్సి వస్తుందని..

- అల్లుడితో కలిసి హత్య చేసిన భార్య
- సహజ మరణంగా చిత్రీకరణ.. మృతదేహంపై గుర్తులతో అనుమానం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

02

## హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు

- 72వ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం
- హాజరు కానున్న 120 దేశాల భామలు

02



## వనపర్తి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం

4వేలకుగా పైగా చనిపోయిన కోళ్లు

సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు



02

## కులగణనకు చట్టబద్ధత ఉందా?

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- గులాబీ పార్టీకి పట్టిన గతే హస్తం పార్టీకి..
- ఎంపీ ఈటల రాజేందర్ మండిపాటు

కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. ఇలాగే చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు ఈటల రాజేందర్. బుధవారం మీడియాతో మాట్లాడిన ఈటల రాజేందర్.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని విమర్శించారు. అదే తరహాలో కాంగ్రెస్ నడుస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని వ్యాఖ్యానించారు.



02

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# వందశాతం అధికారం మళ్లీ మనదే



మొదటి పేజీ తరువాయి

జరిగింది. భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలపై కార్యక్రమాల నిర్వహణపై, సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరి అంశాలపై నేతలతో కేసీఆర్ చర్చించి.. శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటి వరకు సుదీర్ఘ ప్రస్థానాన్ని పార్టీ నేతలకు గుర్తు చేశారు. ఉద్యమం, తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని వివరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని.. ప్రజల కోసం పోరాటం చేయాలని శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదని స్పష్టం చేశారు. ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసునన్నారు. వందశాతం మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనక్కి వెళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. భారాస మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదు. ప్రజల కష్టాలు భారాసకు మాత్రమే తెలుసు. వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం. పోరాడి సాధించుకున్న తెలంగాణ మళ్లీ వెనక్కిపోతోంది. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలి.'ఏడాది పొడవునా భారాస రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి. ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో భారాస ప్రతినిధుల సభ. రజతోత్సవ కార్యక్రమాల కోసం సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఇక నుంచి దృష్టి సారిస్తాం అని అన్నారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ ఉంటుంది. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు. ఆ తర్వాత సంస్థాగత కమిటీల ఏర్పాటు. అక్టోబరు, నవంబర్‌లో పార్టీ అధ్యక్షత ఎన్నిక. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడాలి. ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ కాదు భారాస. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన పార్టీ. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం. ప్రజల్లో ప్రభుత్వం గ్రాఫ్ పడిపోతోంది.. ఇక లేవదు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పటిష్ఠంగా నిర్మించాలి. పార్టీ, ప్రజల శాశ్వత విజయం కోసం పనిచేయాలి' అని కేసీఆర్ సూచించారు. అంతకు ముందు ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రం నుంచి కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ భవన్ వద్ద పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు హాజరయ్యారు.



## ఛత్రపతి శివాజీకి సీఎం నివాళి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. భారత దేశానికి అపారమైన సేవలు అందించిన శివాజీ మహారాజ్ వీరత్వం, పరిపాలనా నైపుణ్యం స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు వాకాటి శ్రీహరి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొని శివాజీ మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పరిపాలనా విధానాలు నేటితరానికి మార్గదర్శకంగా ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సేవలో ప్రతి నాయకుడు పని చేయాలని నేతలు సంకల్పం వ్యక్తం చేశారు. ఇక దేశవ్యాప్తంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆరాధ్య దైవంగా కొలిచే మహారాష్ట్ర ప్రజలు వాడవాడన సంబరాలు జరుపుకున్నారు.

## సీఈసీగా జ్ఞానేశ్ బాధ్యతలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** భారత 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 2024 నుండి ఎన్నికల కమిషనర్‌గా ఉన్న ఆయన సోమవారం సీఈసీగా పదోన్నతి పొందారు. మంగళవారం పదవీ విరమణ చేసిన రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేష్ కుమార్ పోల్ ప్యానెల్ అధిపతిగా నియమితులయ్యారు. అయితే ఆయన నియామకాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. అర్ధరాత్రి సమయంలో సీఈసీ పేరు ప్రకటించడమేంటి? అని నిలదీసింది. ఇక ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. బుధవారం విచారణకు రానున్నాయి.

## భర్తకు సేవ చేయాల్సి వస్తుందని..

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** కొందరు చిన్నచిన్న కారణాలు తమకు ఇబ్బందులు కలుగుతాయనే భావనతో హత్యలకు పాల్పడి కటకటాలపాలవుతున్నారు. భర్త కష్ట కాలంలో ఉన్నప్పుడు అతనికి తోడుగా ఉండాల్సిన భార్య అతనికి సేవ చేయాల్సి వస్తుంది అని.. అల్లునితో కలసి హత్య చేసింది. వివరాల్లోకి వెళ్తే.. పైగా దీనిని సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. కానీ అతని మెడపై కమిలిపోయిన గాయాలు ఉండటంతో.. మృతుడి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. కాగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట (మం) బాచారం గ్రామానికి చెందిన కర్రెల ఆశయ్య (45), శివ్వమ్మకు కూతురు లావణ్య, కొడుకు శివకుమార్ ఉన్నారు. కాగా వీరికి ఉన్న ఎకరన్నర అసైన్డ్ భూమిలో పంటలు పండకపోవడంతో, హైదరాబాద్ నగరానికి కూలీలుగా వలస వెళ్లారు. కాగా రోడ్డు ప్రమాదంలో కొడుకు చనిపోవడంతో తిరిగి మళ్లీ వారి స్వగ్రామానికి వచ్చారు. కూతురు లావణ్యను జూకల్‌కు చెందిన రమేశ్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చారు. కాగా ఆశయ్య గ్రామంలోనే పశువులు కాస్తు ఉండేవాడు.. కాగా ఇటీవల వారికి ఉన్న పొలంలో బోరు వేసి, ఆ భూమిని వ్యవసాయనికి ఉపయోగంగా మార్చారు.. అయితే శని వారం పొలం పనులకు వెళ్లిన ఆశయ్య.. పొలం గట్టు పై నుంచి జారిపడగా, అతనికి తుంటి ఎముక విరిగింది. దీనితో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆశయ్యకు శస్త్ర చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఇంటికెళ్లిన తర్వాత వైద్య ఖర్చులు ఎలా భరించాలి అనుకున్నారో, అవిటితనంతో కుటుంబానికి భారమవుతాడని భావించారో, లేక రైతు బీమా కోసం ఆశ పడ్డారో తెలియదు కానీ అల్లుడు రమేష్‌తో కలిసి, శివ్వమ్మ నిద్రలో ఉన్న భర్త ఆశయ్య మెడకు తువ్వాలతో ఉరేసి హత్య చేసింది. పొద్దున లేవగానే ఆశయ్యది సహజ మరణంగా చిత్రీకరించారు. అయితే సోమవారం సాయంత్రం అంతిమయాత్ర జరుగుతుండగా ఆశయ్య మృతదేహాన్ని దింపుడు కల్లం వద్ద ఆపారు. ఆ సమయంలో మెడపై ఉన్న గుర్తులు చూసి మృతుడి సోదరికి అనుమానం వచ్చింది. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ శవాన్ని స్వాధీనం చేసుకొని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## రైతులకు కేంద్రం శుభవార్త

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** దేశవ్యాప్తంగా ఉండే రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. అన్నదాతల పెట్టుబడుల సహాయార్థం ఇచ్చే పీఎం కిసాన్ పథకం 19వ విడత విడుదల తేదీని కేంద్రం ప్రకటించింది. బిహార్‌లోని భాగల్పూర్‌లో ఈ నిధులను ప్రధాని నరేంద్రమోదీ 24న విడుదల చేస్తారు. తద్వారా ఇందులో నమోదు చేసుకున్న ప్రతి రైతు ఖాతాలో రూ.2వేలు జమా కానున్నాయి. ఈ పథకం దార్వా 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని అధికారులు తెలిపారు. ఈ నిధులను అందుకోవాలంటే.. ఈ-కేవైసీ పూర్తి చేసి.. ఎన్‌పీపీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతా ఉండటం తప్పనిసరి. పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లో తమ స్టేటస్ కానీ, రైతుల పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చని అన్నారు. అంతేకాక.. పీఎం కిసాన్ యాప్ కూడా అందులో ఉందని పేర్కొన్నారు..

## పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ అమలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** అనధికార లేఔట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు తెచ్చిన ఎల్ఆర్ఎస్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎల్ఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. గత నాలుగేళ్లుగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. పది శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకూ అవకాశం ఇవ్వనున్నారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. నిషేధిత జాబితాలోని భూముల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రులు ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దే చెల్లింపులు చేసి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## పరిమితికి మించి టికెట్లు ఎందుకు అమ్మారు?

- ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటలో 18 మంది మృతిపై హైకోర్టు ఆగ్రహం
- వివరణ ఇవ్వాలని కేంద్రం, రైల్వే శాఖకు ఆదేశం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** ఢిల్లీ రైలు ప్రమాద ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిమితికి మించి టిక్కెట్లు ఎందుకు అమ్మారని ప్రశ్నించింది. ఇందుకు వివరణ ఇవ్వాలని కేంద్రానికి, రైల్వేశాఖకు ఆదేశం ఇచ్చింది. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో గతవారం తొక్కిసలాట జరిగి 18 మంది మృతి చెందిన ఘటనపై కేంద్రం, భారత రైల్వేలపై ఢిల్లీ హైకోర్టు బుధవారం తీవ్ర స్థాయిలో స్పందించింది. పరిమితికి మించి ఎక్కువ టికెట్లు ఎందుకు అమ్మారని చీఫ్ జస్టిస్ డీకే ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై సమాధానం ఇవ్వాల్సిందిగా కేంద్రంతో పాటు, రైల్వేశాఖను ఆదేశించింది. రైలు బోగీల్లో సంఖ్యను పరిమితం చేయడం, దానిని ఉల్లంఘించిన వారికి 6 నెలల జైలు విధించే రైల్వే యాక్ట్‌లోని సెక్షన్‌ను అమలు చేసేలా చూడాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై కోర్టు విచారణ జరిపింది. 'ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసేలా ఉన్న నిబంధనలు అమలు చేయడం, జరిమానాలు విధించడంపై మీరు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఇంత చిన్న విషయాన్ని మీరు తూ.చ. తప్పకుండా అమలు చేసి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చేది కాదు. రద్దీ సమయాల్లో కనీసం సంఖ్యకు తగ్గట్టుగా సీటింగ్ కెపాసిటీ పెంచి ఉండాలి. దాన్ని కూడా నిర్లక్ష్యం చేసినట్టు కనిపిస్తోంది. బెర్త్‌ల సంఖ్య కంటే ఎక్కువ టికెట్లు ఎందుకు అమ్మారు?' అని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. హైకోర్టు తీవ్ర స్థాయిలో నిలదీయడంలో రైల్వేల తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటామని, పరిస్థితికి సంబంధించిన అన్ని అంశాలను రైల్వే బోర్డు పరిశీలిస్తుందని తెలిపారు. దీంతో తదుపరి విచారణను మార్చి 26వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

## వరద సాయం నిధులు విడుదల

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19:** గత ఏడాది సంభవించిన విపత్తులు, వరదలకు సంబంధించిన సాయాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఐదు రాష్ట్రాలకు రూ.1554.99 కోట్ల అదనపు సాయాన్ని ఆమోదించింది. 2024లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాతో పాటు నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో సంభవించిన విపత్తులకుగానూ మోడీ సర్కార్ ఆయా రాష్ట్రాలకు విపత్తు సాయంపై అందజేసింది. ఏపీ, తెలంగాణలో ఆకస్మిక వరదలు రావడంతో పాటు కొండ చరియలు విరిగి పడటం లాంటి ప్రకృతి విపత్తులు జరిగిన మిగితా మూడు రాష్ట్రాలకు కలిపి నిధులు రిలీజ్ చేసింది.తాజాగా, కేంద్ర ప్రభుత్వం అదనంగా కేటాయించిన మొత్తం నిధులు రూ. 1554.99 కోట్లలో ఏపీకి రూ. 608.08 కోట్లు, తెలంగాణకు రూ. 231. 75 కోట్లు.. త్రిపురకు రూ. 288.93 కోట్లు, ఒడిశాకు రూ. 255.24 కోట్లు, నాగాలాండ్ కు 170. 99 కోట్ల రూపాయలను విడుదలకు నిర్ణయం తీసుకుంది. కాగా, గతేడాది వరదలు, విపత్తు కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు ఇప్పటికే కొన్ని నిధులు విడుదల చేయగా.. నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పర్యటించి నివేదికలు ఇచ్చిన మరో ఐదు రాష్ట్రాలకు అదనంగా నిధులను కేటాయించింది. అయితే, 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సర్కార్ ఎస్‌డీఆర్ఎఫ్‌లో భాగంగా 27 రాష్ట్రాలకు రూ. 18,322.80 కోట్లు విడుదల చేయగా.. 18 రాష్ట్రాలకు రూ. 4,808.30 కోట్లు రిలీజ్ చేసింది.

## హైదరాబాద్ వేదికగా ప్రపంచ అందాల పోటీలు

**హైదాబాద్, ఫిబ్రవరి 19:** ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ వేదిక కానున్నది. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. దాదాపు నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతో పాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కిపైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఏ పర్పస్ అనే థీమ్‌తో ఈ మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించనుండగా.. దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలుకబోతున్నది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు జరగనున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తారు. గతంలో న్యూఢిల్లీ, ముంబయి నగరాల్లో ఈ అందాల పోటీలు జరిగాయి. 71వ ఎడిషన్ ముంబయిలో నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాయి. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానిస్తుంది. గొప్ప చేనేత వారసత్వం.. అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు.. అరుదైన వంటకాలు.. విభిన్నమైన కళా వారత్వం ఉన్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రకటించారు.

## వనపర్తి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం



### 4వేలకుగా పైగా చనిపోయిన కోళ్లు
### సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు

**వనపర్తి, ఫిబ్రవరి 19:** జిల్లాలోని బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. మదనపురం మండలం కొన్నూరు గ్రామంలో శివకేశవరెడ్డి అనే రైతుకు చెందిన కోళ్ల ఫామ్‌లో 4000 కోళ్లు మృత్యువాతపడ్డాయి. బర్డ్ ఫ్లూ వ్యాధితో ఇంత పెద్ద సంఖ్యలో కోళ్లలో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఎప్పటి లాగే బుధవారం ఉదయం రైతు శివకేశవరెడ్డి కోళ్లఫామ్‌కు వచ్చి చూడగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోయి కనిపించాయి. దీంతో వాటిని గుంతలో పోడ్చేశారు. అయితే నాలుగువేళ్ల కోళ్ల మృతిపై వెటర్నరీ అధికారులకు రైతు సమాచారం ఇచ్చాడు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. కోళ్లు చనిపోవడంపై రైతు మాట్లాడుతూ.. ఇన్ని కోళ్లు చనిపోవడానికి కారణం ఏంటో చెప్పాలని.. తనకు న్యాయం చేయాలని కోరారు. బర్డ్ ఫ్లూ వల్లే కోళు చనిపోయాయని అనుకుంటున్నానని.. దానిపై అధికారులు నిర్ధారణ చేయాలన్నారు. ప్రతీసారి తనకు కోళ్లపై లాభం వచ్చేదని.. కానీ ఈసారి మాత్రం పూర్తి నష్టపోయాయనని న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు. కాగా.. 5500 కోళ్ల కెపాసిటీతో నిర్మించిన శివకేశవరెడ్డికి చెందిన కోళ్లఫామ్‌లో నాలుగువేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. ఈ కోళ్లను ప్రీమియర్ కంపెనీ నుంచి సాకుతున్నాడు రైతు. అయితే నిన్నటి నుంచి కోళ్లు చనిపోవడాన్ని గుర్తించిన శివకేశవ రెడ్డి కంపెనీ యాజ మాన్యానికి ఫోన్‌లో సమాచారం అందించారు. అయితే దీన్ని తేలిగ్గా తీసుకున్న కంపెనీ యాజమన్యం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రైతుకు చెప్పింది. అయితే బర్డ్ ఫ్లూగా అనుమానించిన శివకేశవరెడ్డి నిన్న చనిపోయిన 500 కోళ్లను గొయ్యి తీసి పాతిపెట్టాడు. దాదాపు 4000 కోళ్లు మృత్యువాత పడటంతో వాటిని కూడా గోతి తీసి పాతిపెట్టాడు రైతు. ఇలా వరుసగా కోళ్లు చనిపోవడంపై పశుసంవర్ధక శాఖ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామంలో పౌల్ట్రీ రైతులు ఆందోళనకు దిగారు.

## కమాండ్ కంట్రోల్‌లోకి గుర్తు తెలియని వ్యక్తి

### సీరియస్‌గా తీసుకున్న పోలీసు అధికారులు



**వనపర్తి, ఫిబ్రవరి 19:** కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకి (సీసీసీ) గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహిస్తున్న సమయంలోనే మూడుసార్లు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అయితే సీసీసీ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గుర్తించిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ అంటూ ప్రచారం చేసుకుంటూ సదరు వ్యక్తి సీసీసీ సెంటర్‌లో సంచరిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆ ఫేక్ ఉద్యోగి జ్ఞాన సాయి ప్రసాద్‌గా విచారణలో బయటపడింది. జ్ఞాన సాయి ప్రసాద్ సీసీసీ సెంటర్ ఎదురుగా ఉన్న హోటల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వ్యాపార లావాదేవీల పేరుతో గోవర్ధన్ అనే వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. గోవర్ధన్ నుంచి జ్ఞాన స్థాయి ప్రసాద్ మూడు లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ముఖ్యమంత్రి ఉన్న సమయంలోనే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి వెళ్లడాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
గురువారం
20 ఫిబ్రవరి 2025


# పగటి కలలుకంటున్న గులాబీ నేత

- పగటి కలలుకంటున్న గులాబీ నేత
- మళ్లీ అధికారంలోకి రావడం కల్ల
- విమర్శలు గుప్పించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,ఫిబ్రవరి19 :** మాజీ సీఎం కేసీఆర్ సీజనల్ రాజకీయవేత్త అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. తిరిగి అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటికలలు కంటున్నారని విమర్శించారు. 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగినప్పుడు, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఆయనకు ప్రజలు గుర్తుకురాలేదా అని నిలదీశారు. శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదని ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు కష్టపడి కేసీఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే, ఆయన ఏనాడు ప్రజాతీర్పును గౌరవించలేదన్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే పదేళ్ల తన పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమన దిశలోకి తీసుకెళ్లారో తెలుస్తుందని ధ్వజమెత్తారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదన్నారు. ఇవన్నీ మరచిపోయి ఇప్పుడు అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని మండిపడ్డారు. కెసిఆర్ మాటలను ఆ పార్టీ కార్యకర్తలు కూడా నమ్మరని అన్నారు.

# ఆర్టీసీ శుభవార్త

## హైదరాబాద్ టు విజయవాడ వెళ్లే వారికి 10శాతం రాయితీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారికి ఈ గుడ్‌న్యూస్ అందించింది. హైదరాబాద్–విజయవాడ మార్గంలో ప్రత్యేక రాయితీలను ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ వెల్లడించింది. లహరి- నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో 10 శాతం రాయితీ, అదే రాజధాని ఏసీ బస్సుల్లో 8 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు టీజీఆర్టీసీ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రాయితీతో కల్పించే డిస్కౌంట్ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించింది. టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించింది. ఈ విషయాన్ని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వెల్లడించారు. విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారికి టికెట్లపై ఆర్టీసీ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు.

# కులగణనకు చట్టబద్ధత ఉందా?

### బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
### గులాబీ పార్టీకి పట్టిన గతే హస్తం పార్టీకి..
### ఎంపీ ఈటల రాజేందర్ మండిపాటు



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఇలాగే చేస్తే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఈటెల రాజేందర్.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని విమర్శించారు. అదే తరహాలో కాంగ్రెస్ నడుస్తోందన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు 3 రెట్లు అధికంగా పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఈటల ఆరోపించారు. జాతీయ రహదారుల కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని.. కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని ఈటల రాజేందర్ తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ భూ సేకరణలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ హై వే పనులు వేగంగా జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఈటల విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇకనైనా కళ్లు తెరవాలని హితవు చెప్పారు ఎంపీ. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామని ఎంపీ ఈటల ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేసే పరిస్థితి లేదని ఈటల స్పష్టం చేశారు. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారాయన. కాంగ్రెస్ పార్టీ చేసిన కులగణనకు చట్టబద్ధత ఉందా? అని ఎంపీ ప్రశ్నించారు. తమిళనాడులో చేసిన విధంగా చేస్తే స్వాగతిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి కట్టుబడి కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.



# పూజారి రంగరాజన్‌కు జగన్ పరామర్శ

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడి ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది.. రామరాజ్యం పేరుతో.. ఓ అర్చకుడిపై దాడి చేయడం ఏంటి అంటూ.. అంతా ఆందోళన వ్యక్తం చేశారు.. చిలుకూరు ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. రంగరాజన్‌కు ఫోన్ చేసిన వైఎస్ జగన్.. దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు. ధర్మ పరిరక్షణకు అంకితభావంతో సేవలందిస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ఉన్నతమైన ధార్మిక విలువలను పాటిస్తున్న రంగరాజన్ కుటుంబంపై దాడి బాధాకరమైన విషయం అన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు బాలజీ ఆలయం సమీపంలోని రంగరాజన్ నివాసానికి వచ్చిన పలువురు వ్యక్తులు. రామరాజ్య స్థాపనకు మద్దతు ఇవ్వాలని కోరడం అందుకు ఆయన నిరాకరించడం.. ఆ తర్వాత రంగరాజన్‌తో పాటు ఆయన కుమారుడిపై దాడి చేయడం.. ఆ వీడియో కాస్త వైరల్‌గా మారడం.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలువురిని అరెస్ట్ చేసిన విషయం విదితమే..

# ప్రతీది గుర్తు పెట్టుకుంటున్నా..

### హోటల్ మూసివేయడంపై కేటీఆర్ మండిపాటు



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడతుందని, మొన్న కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా స్వీట్లు పంచినందుకు టీచర్‌ను సస్పెండ్ చేశారని, ఇప్పుడు నా ఫొటో పెట్టుకున్నందుకు టీ హోటల్‌నే మూసివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నానని.. ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇదే మాట మీద ఉంటానని మీకు మాట ఇస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు టీ షాపు యజమాని బత్తుల శ్రీనివాస్ ఆవేదనతో మాట్లాడుతున్న ఒక వీడియోను షేర్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్ బతుకమ్మ ఘాట్ వద్ద గత నాలుగేళ్లుగా 'కేటీఆర్ టీ స్టాల్' నడిపిస్తున్నాడు. హెూటల్ బోర్డుపై కూడా కేటీఆర్ ఫొటో పెట్టుకున్నారు. ఇది గమనించిన సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆ హెూటల్‌ను మూసేయించారు. అసలు ఆ టీ స్టాల్‌కు ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేకుంటే హెూటల్‌ను సీజ్ చేయండి అంటూ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ హుకుంతో వెంటనే రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది టీ స్టాల్‌ను బలవంతంగా మూసివేయించారు.

### సీఎం రేవంత్‌రెడ్డికి రూ. 4.20 లక్షల కోట్లు జరిమానా వేసిన తప్పులేదు

సింగపూర్ పార్లమెంట్‌లో రెండు అబద్ధాలు చెప్పిన ఎంపీకి 14వేల డాలర్ల జరిమానా విధించిన విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావించారు. మరి కాళేశ్వరం గురించి, రాష్ట్ర అప్పుల గురించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి, రైతు రుణమాఫీ గురించి, రైతు బంధు గురించి, నాలుగు వేల పింఛన్లు అని, మహిళలకు రూ.2500 అని.. ఇలా 420 అబద్ధాలు చెప్పిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి 4.20 లక్ష కోట్ల జరిమానా వేసిన తప్పులేదని విమర్శించారు. పార్లమెంటరీ కమిటీ ముందు అబద్ధాలు చెప్పినందుకు భారత సంతతికి చెందిన సింగపూర్ ఎంపీ ప్రీతమ్ సింగ్ (48)కి అక్కడి కోర్టు జరిమానా విధించింది. ఒక్కో అబద్ధానికి రూ.7వేల సింగపూర్ డాలర్ల చొప్పున.. రెండు అబద్ధాలకు 14వేల సింగపూర్ డాలర్లను కట్టాలని ఆదేశించింది.

# ఫామ్‌హౌజ్ వీడారు.. కానీ ప్రజలను చేరుకోలేరు

### ఉప ఎన్నికలంటూ కార్యకర్తలను నమ్మించే యత్నం
### కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి చామల



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 :** ఉప ఎన్నికలంటూ ..బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి అంటున్నారు. ఐదు ఏండ్ల వరకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదు. లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా మీకు ఉనికి లేదు. అందుకే కేసీఆర్ ఇలాంటి మెసేజ్ లు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా కేవలం కార్యకర్తల్లో ధైర్యం నింపడానికేనని అన్నారు. ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కార్యకర్తల ముందు అంటున్నారు. కేవలం కార్యకర్తలను ఉత్తేజ పర్చడానికే కేసీఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది చెప్పారు. ఆయనకు చిత్తశుద్దే లేదు. చిత్త శుద్ధి ఉంటే ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ కి వచ్చి ప్రజల సమస్యలు చర్చించే వారుని ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయని బాంబు పేల్చారు. 'సిల్వర్ జూబ్లీ వేడుకలే ఇంపా÷–టర్గ÷ంట్. ఈ సీఎం ఇంతలా ప్రజల్లో వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. మనం ప్రతి సంవత్సరం ఆదాయం పెంచుకుంటూ పోయాం. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుంది. అదే అధికారులు ఉన్నారు. కానీ ఈ ప్రభుత్వానికి చేయించుకోవడం రావడం లేదు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయి. మీరు సిద్ధంగా ఉండండి. మళ్లీ మనదే అధికారం.. మీరే ఎమ్మెల్యేలు అవుతారని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను చామల తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్‌ను ప్రజలు ఇక నమ్మేస్థితిలో లేరని అన్నారు.

# ఉప్పల్‌లో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

### గోడౌన్‌లో మెడిసిన్స్ సీజ్

**హైదరాబాద్,ఫిబ్రవరి19 :** ఉప్పల్ లో డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బుధవారం చేపట్టిన ఈ తనిఖీల్లో భారీగా మెడిసిన్స్ ను సీజ్ చేశారు. ఉప్పల్ లోని లక్ష్మీనారాయణ నగర్ కాలనిలో తనిఖీలు చేపట్టిన అధికారులు అక్రమంగా నిర్వహిస్తున్న గోడౌన్ ను గుర్తించారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా గోడౌన్ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు రూ. 6 లక్షల 70 వేలు విలువచేసే 6 రకాల యాంటీబయాటిక్స్ ను, ఇతర మెడిసిన్స్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. గోడౌన్ నిర్వాహకుడు అద్దంకి వెంకటే సురేష్ బాబును అదుపులోకి తీసుకున్నారు అధికారులు.




# పాస్‌పార్టు ఆఫీస్‌కు మాజీ సీఎం కేసీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. బుధవారం ఉదయం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి తన సతీమణితో కలిసి కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసు వచ్చారు. తన పాస్‌పోర్టును రెన్యూవల్ చేసుకోనున్నట్లు తెలుస్తోంది. డిప్లమాటిక్ పాస్‌పోర్టును సబ్‌మిట్ చేసి సాధారణ పాస్‌పోర్టును తీసుకునేందుకు కేసీఆర్ పాస్‌–పోర్టు కార్యాలయానికి వచ్చారని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్‌తో పాటు సతీమణి, జోగినపల్లి సంతోష్ ఆఫీస్‌లోకి వెళ్లారు. దాదాపు అరగంట పాటు రెన్యూవల్ ప్రాసెస్ జరిగింది. పాస్‌పోర్టు రెన్యూవల్ అనంతరం కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసు నుంచి నందినగర్‌లోని నివాసానికి బయలుదేరి వెళ్లారు. కాగా.. త్వరలో మాజీ సీఎం అమెరికాకు వెళ్తారనే ప్రచారం జోరుగా జరుగుతున్న వేళ కేసీఆర్ పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. పాస్ట్‌పోర్టు తీసుకున్న తర్వాత నెలా, రెండు నెలల్లో అమెరికా ప్రయాణం ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే పది సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు కానీ, సీఎం అవకముందు కూడా కేసీఆర్ అమెరికా గడప దొక్కిన దాఖలాలు లేవు. మనవడు హిమాన్షు అమెరికాలో ఉన్నతవిద్యాభ్యాసం అభ్యసిస్తున్న నేపథ్యంలో అక్కడకు వెళ్తారని, రెండు నెలల పాటు అక్కడే కేసీఆర్ ఉంటారనే ప్రచారం జరుగుతోంది.



# లింగమతుల జాతరలో మంత్రి కోమటిరెడ్డి పూజలు



**సూర్యాపేట, ఫిబ్రవరి 19:** దురాజ్ పల్లిలో జరుగుతున్న లింగమంతుల జాతరలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం సెక్యూలర్ విధానాన్ని పాటిస్తుందని, అన్ని మతాలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. మాది సెక్యూలర్ ప్రభుత్వమని, మాకు అన్ని పండుగలు సమానమేనని అన్నారు. ప్రజలందరికీ సమాన న్యాయం అందించడమే మా ధ్యేయం అని తెలిపారు. బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన ఆయన, ఓట్ల కోసం దేశాన్ని విడగొట్టే పార్టీ బీజేపీ.. వాళ్లకు మా గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. అలాగే, తెలంగాణలో కాంగ్రెస్ పాలన మరింత బలోపేతం అవుతుందని, వచ్చే 20 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే బీసీనీ సీఎం చేస్తామని చెప్పిన బీజేపీ, ఓ బీసీ నేత పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా అతన్ని పక్కన పెట్టిందని చెప్పుకొచ్చారు. వాళ్ల నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. దళితుడిని సీఎం చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలు, ఇప్పుడు వాస్తవాన్ని అర్థం చేసుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి రాకతో దురాజ్ పల్లి లింగమంతుల జాతర వైభవంగా సాగుతోంది.

# యాదాద్రిలో మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు

### 23న స్వర్ణ గోపురం మహాకుంభాభిషేక ప్రతిష్టాపనం



**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 19:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో బుధవారం నుంచి 23 వరకు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. 23న సుదర్శన లక్ష్మీనరసింహ దివ్య విమాన స్వర్ణ గోపురం మహాకుంభాభిషేక ప్రతిష్టా మహోత్సవం జరుగుతుంది. ఈ రోజు ఉదయం 7.45 గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం పూజలతో మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీప ప్రజ్వలన, అంకురార్పణ, ద్వార తోరణం ధ్వజ కుంభారాధన, అంకురార్పణ హోమం చేపట్టారు. ఐదు రోజుల పాటు వానమామలై మఠం పీఠాధిపతి మధుర కవి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 108 మంది ఋత్వికులతో పంచకుండాత్మక యాగం జరుగుతుంది. కాగా 23వ తేదీ వరకు ఆలయంలో భక్తులచే జరిపే సుదర్శన నరసింహ హోమం రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని అనుకుంటున్నారు. అయితే ఆలయ అధికారులు ఈ విషయంలో ఎలాంటి సమాచారం తెలపలేదు.



# సమర్థ నాయకత్వమే కాంగ్రెస్ సమస్య!

గుర్రం ఎంత వడిగలదైనా..రౌతు సరిగా లేకపోతే అది కుంటుతూ నడుస్తుందని సామెత. ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి అదే. కాంగ్రెస్ పార్టీకి సమర్థ నాయకత్వమే ఇప్పుడు లోపం. దానిని అందిపుచ్చుకునే ప్రయత్నం చేయడంలో రాహుల్ పెద్దగా పని చేయడం లేదు. ఆయన ఛరిష్మా పనిచేయడం లేదు. గత పార్లమెంట్‌లో ప్రతిపక్షహోదా కూడా దక్కని పార్టీకి ప్రజలు ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష మోదా కల్పించారు. లోక్‌సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రతిపక్షనేతగా ఉన్నారు. అయితే ఆయనక ఈ దేశంపైనా, సమస్యలపైనా పెద్దగా అవగాహన లేకపోవడం ప్రజలు చేసుకున్న దురదృష్టంగా చెప్పుకోవాలి. సమర్థత లేకపోవడం వల్లనే లోక్‌సభలో ప్రజల సమస్యలపై గట్టిగా నిలదీయలేక చతికిల పడుతున్నారు. విపక్షనేత ఎంత సమర్థుడ యితే అంతగా అధికార పక్షం ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేస్తుంది. కాంగ్రెస్‌లో ఆ లక్షణాలు కనిపించడం లేదు. అలాంటి లక్ష్యం కూడా కానరావడం లేదు. కేవలం సొంత ఎజెండాతో పోవడం వల్లనే మోడీ మరింత బలోపేతం అవుతున్నాడు. కూటమిగా ఏర్పడ్డ ఇండియా కూటమి ఓ రకంగా చెప్పాలంటే విచ్ఛిన్నం అయ్యిందనే చెప్పాలి. ఆప్ అంటే కాంగ్రెస్‌కు పడదు. కాంగ్రెస్ అంటే మమతా బెనర్జీకి పడదు. నాయకుడు అన్నవాడు విపక్షంలో ఉంటే విపక్ష పార్టీలను కలుపుకుని పోవాలి. కానీ ర ఆహుల్‌లో అలాంటి నాయకత్వ లక్షనాలు మచ్చుకైనా కానరావడం లేదు. ఇకపోతే ప్రాంతీయ పార్టీలు అధికారం వెలగబెట్టడం, అప్పులు చేయడం, రాష్ట్రాలను దివాళా తీయించడం అలవాటుగా చేసుకున్నాయి. కెసిఆర్, జగన్ పాలనతో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీసాయి. క్రమక్రమంగా ఆయా ప్రాంతీయ పార్టీలను, వాటి నాయకులు రాష్ట్రాలను తమ సొంత ఆస్తులుగా,జాగీర్లుగా మార్చి ఏలుతున్నారు. అయితే వాటిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. దానికి స్పష్టమైన సంకేతంగా మన ఉమ్మడి ఎపి అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో కుటుంబ పెత్తనం, నేతల అహంకారం పెరిగిపోవడంతో ప్రజలు వారిని అధికారం నుంచి దూరం పెట్టారు. కర్నాటకలో ఓ వెలుగు వెలిగిన దేవెగౌడ, కుమారస్వామిల జేడీఎస్ ఇప్పుడు బిజెపికి తోకపార్టీగా మిగిలిపోయింది. ఇక మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌ను కూడా ప్రజలు ఊడ్చిపడేశారు. ఈ పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో పశ్చిమబెంగాల్లో మమత సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్, బిహార్‌లో నితీష్ సారథ్యంలోని జేడీయూలకు ఇదే గతిపట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. 2014కు ముందు దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ స్థానాన్ని ఒక దశాబ్దం నుంచి ఆయా ప్రాంతీయ పార్టీలు ఆక్రమించు కున్నాయి. యూపిఎ కూటమిలోని పార్టీల అవినీతిని భూతద్దంలో చూపెట్టి రాజకీయాల్లోకి గోబెల్స్ ప్రచారంతో వచ్చిన అర్వింద్ కేజ్రీవాల్ సైతం నేడు అదే అవినీతి కేసులతో ప్రజల చేతిలో దెబ్బతిన్నాడు. ఇప్పుడు అవినీతి వ్యతిరేకత నినాదాన్ని తుడిచిపెట్టేశాడు. దేశానికి దిశా నిర్దేశం చేయగల సమర్థుడని నమ్మిన ప్రజలను కేజ్రీవాల్ మోసం చేశాడు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అనే నినాదాన్ని నిజం చేయాలనే మోడీ కలలు ఏమాత్రం నెరవేరడం లేదు. ఎందుకంటే ప్రజలు మోడీ విధానాల పైనా గుర్రుగా ఉన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల,నిరుద్యోగం, జిఎస్టీ వంటి సమస్యలను పట్టించుకోక పోవడంతో ప్రజలు మరోమారు కాంగ్రెస్‌కు ఊపిరి పోశారు. మోడీ సరిగా వ్యవహరించివుంటే కాంగ్రెస్‌కు ఈ అవకాశం కూడా వచ్చివుండేది కాదు. ఉత్తరాది హిందీ రాష్ట్రాల్లో బీజేపీకి కొంత అనుకూలించి అధికారంలోకి రాగలిగినప్పటికీ బిజెపిలో భయాందోళనలను కలిగిస్తోంది. ఎందుకంటే దాదాపు పదేళ్ల తర్వాత పార్లమెంట్లో ప్రతిపక్ష హోదాను కాంగ్రెస్ దక్కించుకుంది. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ను బలీయ శక్తిగా నిలిపి జాతీయ రాజకీయాల్లో తన పూర్వవైభవానికి తీసుకొని రాకున్నా బిజెపికి డేంజర్ బెల్స్ కనిపించేలా చేశాయి. అయితే ఈ పరిణామాలతో బిజెపి మేల్కోవడం లేదు. అలాగే కాంగ్రెస్ కూడా సమర్థంగా పనిచేయడం లేదు. అవినీతి వ్యతిరేక ప్రచారంతో దూసుకువచ్చిన కేజ్రీవాల్ సైతం కొట్టుకు పోవడంతో భారత రాజకీయాల్లో ఇప్పుడు పెద్ద అగాథం ఏర్పడింది. దేశంలో కాంగ్రెస్, బీజేపీలను ఎదుర్కొనే సత్తా ప్రాంతీయ పార్టీలకు లేదు. ఉమ్మడిగా పోరాడలన్న ధైర్యం కాంగ్రెస్‌లో లేదు. సామర్థ్యం ఉన్న నాయకుడు గా రాహుల్ గాంధీ రాణించడం లేదు. పెద్ద రాష్ట్రమైన యూపీలో బీఎస్పీ పూర్తిగా చతికిలపడిపోయింది, దీంతో అక్కడి దళిత, మైనార్టీలంతా కాంగ్రెస్,సమాజ్‌వాది లను అక్కున చేర్చుకున్నారు. అయితే యోగి ఆదిత్యనాథ్ పాలన బాగున్నా జాతీయస్థాయి సమస్యలు ఆయనకు కూడా మింగుడు పడడం లేదు. విపక్ష నేతగా రాహుల్ గట్టిగా నిలబడాలంటే ఆయన చుట్టూ ఉన్న కోటరీ మారాలి. మంచి విపక్షనేతగా ఎదగాలి. సమసయలపై అధ్యయనం చేయాలి. కేవలం మోడీని తిడుతూ కూర్చోకుండా ఆయా సమస్యలను ముందుకేసుకుని పోరాడాలి. ప్రజల్లో అప్పుడే రాహుల్ పట్ల నమ్మకం ఏర్పడగలదు. ప్రతిపక్ష నేత పాత్రను పోషిస్తున్న రాహుల్ గాంధీకి ఆదరణ పెరగాలంటే పోరాటాలు చేయాలి. ఎక్కడ సమస్యలు ఉన్నా పరుగెత్తాలి. సమస్యల మూలాలను పసిగట్టాలి. ప్రజలకు అండగా పోరాడాలి. పెరిగిపోతున్న అసమానత లను, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం దాసోహం అవుతున్న తీరును మరింత సమర్థవంతంగా ప్రజలకు తెలియజేస్తూ పోరాట పంథాను మార్చుకోగలగాలి. రాహుల్ ఈ సమర్థ పోరాటమే కాంగ్రెస్ పార్టీ పునాదుల్ని మరింత సుస్థిరం చేస్తుంది. కర్నాటక, తెలంగాణల్లో అధికారం దక్కినా కాంగ్రెస్ పాలనా తీరులో మాత్రం మార్పు రాలేదు. రాబోయే రోజుల్లో ఉత్తరాదిలోనూ ప్రాంతీయ పార్టీల స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవడానికి అన్ని అవకాశాలు అధికంగా ఉన్నాయి. కావాల్సిందల్లా కార్యాచరణ. ధృఢసంకల్పం మాత్రమే.ఇది తక్షణం బీజేపీకి నష్టం కలిగించకున్నా.. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ తన సామర్థ్యాన్ని, బలాన్ని పెంచుకో వడానికి ఉపయోగపడ్తుంది. దీన్ని అందిపుచ్చుకునే సమర్థ నాయకత్వం రాహుల్ గాంధీకి ఉందా లేదా అన్నది ఆయన చేసే పోరాటంతో మాత్రమే తెలుస్తుంది.

# కశ్మీర్‌పై మరోమారు పాక్ అక్కసు

## ధీటుగా తిప్పికొట్టిన భారత్






**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :** అంతర్జాతీయ వేదికలపై ప్రతిసారీ భారత్‌పై తమ అక్కసు వెళ్లగక్కడం పాకిస్థాన్‌కు ఓ దురలవాటుగా మారింది. దాయాది దేశం తోకముడిచేలా చెంప చెళ్లుమనిపించే సమాధానం మనం ఇస్తున్నా దానికి బుద్ధి మారడం లేదు. తాజాగా మరోసారి పాక్ చేసిన ఆరోపణలను భారత్ ఖండించింది. ఆ దేశం ఎగదోస్తున్న ఉగ్రవాదానికి తాము బాధితులమని వెల్లడించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది. చైనా అధ్యక్షతన జరిగిన భద్రతా మండలి సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ వ్యాఖ్యలు చేశారు. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీస్ వాటికి దీటుగా బదులిచ్చారు. 'ఐరాస ఉగ్రవాద సంస్థల జాబితాలో ఉన్న 20 సంస్థలను పాక్ పెంచి పోషిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. అలాంటి దేశం ఉగ్రవాద వ్యతిరేక పోరులో ముందువరుసలో ఉందని చెప్పుకోవడం హాస్యాస్పదం. ఈ దేశ ఉగ్ర కార్యకలాపాలకు మేం బాధితులం. అమాయక పౌరులపై జరిగే ఉగ్రవాద చర్యలకు ఎలాంటి సమర్థన ఉండదు. ఉగ్రవాదుల్లో మంచి, చెడు అని తేడా ఉండదు. ఇక ఇలాంటి మాటలతో మండలి సమయాన్ని వృథా చేయొద్దు' అని పాక్ మంత్రికి హితవు పలికారు. జమ్మూకశ్మీర్ ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగ మేనని తేల్చిచెప్పారు. కొన్నినెలల క్రితం జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఎన్నికలు, కొత్త ప్రభుత్వం ఏర్పడటం గురించి ప్రస్తావించారు. 'కశ్మీర్ ప్రజల ఎంపిక చాలా స్పష్టంగా ఉంది. పాకిస్థాన్ మాదిరిగా కాకుండా అక్కడ ప్రజాస్వామ్యం బలంగా ఉంది' అని సోదాహరణంగా పాక్‌కు మొట్టికాయలు వేశారు. కశ్మీర్ అంశానికి సంబంధించి పాకిస్థాన్ తన మొండి వాదనను వినిపిస్తూనే ఉంది. కశ్మీరీలు తమ ప్రజాస్వామ్య హక్కులు వినియోగించుకునేందుకు వీలుగా ఐరాస భద్రతా మండలి తీర్మానాలను భారత్ అమలుచేయాలని కోరింది. కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతించాలని కోరుతూ చేసిన ఓ తీర్మానాన్ని పాక్ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే, కశ్మీర్‌కు మద్దతుగా పాకిస్థాన్ తీర్మానం చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ తీర్మానం సందర్భంగా కశ్మీర్ వ్యవహారాల మంత్రి ఇంజనీర్ అమిర్ ముకమ్ మాట్లాడుతూ.. కశ్మీరీ ప్రజల హక్కుల కోసం పాకిస్థాన్ నైతిక, రాజకీయ, దౌత్యపరమైన మద్దతు ఇస్తుందన్నారు. మానవ హక్కుల పరిస్థితులను మెరుగుపరచాలని, నిర్బంధించిన నేతలను విడుదల చేయడంతో పాటు అణచివేత ధోరణిని విడనాడాలని భారత్‌ను కోరుతున్నట్లు తీర్మానంలో పేర్కొన్నారు.



# సిఎంగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు

## ఢిల్లీ ప్రజలకు సేచేసే భాగ్యం లభించింది

## ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన రేఖాగుప్తా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి19:** ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ను భాజపా ఎంపిక చేయడంతో ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన తనకు దిల్లీకి నాలుగో మహిళా సీఎంగా అరుదైన అవకాశం దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. గతంలో సుష్మాస్వరాజ్ (భాజపా), షీలాదీక్షిత్ (కాంగ్రెస్), ఆతిశీ (ఆప్) దిల్లీ సీఎంలుగా సేవలందించగా.. తాజాగా నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా భాజపా అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.'నాపై నమ్మకం ఉంచి సీఎం బాధ్యతల్ని అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు. మీ నమ్మకం, మద్దతు నాకు కొత్త శక్తిని, ప్రేరణను ఇచ్చాయి. దిల్లీలోని ప్రతి పౌరుడి సంక్షేమం, సాధికారత, సమగ్రాభివృద్ధి కోసం పూర్తి నిజాయతీతో, అంకిత భావంతో పనిచేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకొని దిల్లీని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు నిబద్ధతతో పనిచేస్తా' అని పేర్కొన్నారు. రేఖా గుప్తాకు అభినందనలు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తారని ఆశిస్తున్నా. దిల్లీలో అభివృద్ధి పనులకు భాజపాకు తమ మద్దతు ఇవ్వడంలో ఎప్పుడూ ముందుంటుందని చెప్పదలచుకున్నా. రేఖాగుప్తా నాలుగో మహిళా సీఎంగా ఉండటం మంచి విషయం. మహిళలు రాజకీయాల్లో ఎంతో గొప్ప ఉత్సాహంతో కనబడుతున్నారని ఆప్ నేత, ఆపద్ధర్మ సీఎం ఆతిశీ అన్నారు. దిల్లీ సీఎంగా ఎంపికైన రేఖా గుప్తాకు అభినందనలు. దిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఆమె నెరవేరుస్తారని ఆశిస్తున్నా. దిల్లీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేసే ప్రతి పనికీ మద్దతు ఇస్తాం అని కేజ్రీవాల్ అన్నారు

# అక్రమ వలసదారులపై ఉక్కుపాదం

- కాళ్లకు సంకెళ్లు.. చేతులకు బేడీలు
- వీడియోను విడుదల చేసిన ఎలన్ మస్క్



**వాషింగ్టన్,ఫిబ్రవరి 19 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చిన తరవాత భారతీయులను అక్రమ వలసదారులుగా ముద్రవేసి తిరిగి పంపిన దారుణానికి సంబంధించిన వీడియోని వైట్ హౌస్ విడుదల చేసింది. విమానం ఎక్కే ముందు వలసదారులకు సంకెళ్లు వేయడాన్ని వీడియోలో చూడవచ్చు. 41 సెకన్ల వీడియోను ఎక్స్ సిఈఓ ఎలెన్ మస్క్ తన ఖాతాలో షేర్ చేస్తూ.. 'హహా వావ్' అనే వ్యాఖ్య చేశారు. చేతులు, కాళ్ళు కట్టి వలసదారులను బందీలుగా ఉన్నట్లుగా, కఠినంగా తనిఖీ చేస్తున్నట్లు వీడియోలో ఉంది. మానవ హక్కులను పూర్తిగా ఉల్లంఘించే షాకింగ్ దృశ్యాలు బయటకు వచ్చాయి. ట్రంప్ వలసదారులను బహిష్కరించే విధానానికి వ్యతిరేకంగా అనేకచోట్ల నిరసనల జరుగుతున్న నేపథ్యంలో ఈ వీడియోను విడుదల చేశారు. అదే సమయంలో ట్రంప్ ప్రభుత్వం 300 మందికి పైగా వలసదారులను పనామాలోకి అక్రమంగా తరలించింది. బహిష్కరించబడిన వారిలో ఎక్కువ మంది ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, చైనా వంటి దేశాల నుండి వచ్చారు. వారి మొబైల్ ఫోన్లు, పాస్‌పోర్ట్‌లు జప్తు చేయబడ్డాయి. వారిని పనామాలో నిర్బంధంలో ఉంచారు. నివేదికల ప్రకారం, పనామాను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ ఒత్తిడి వ్యూహంలో భాగంగా వలసదారులను పనామాలోకి అక్రమంగా తరలించారు. భారతదేశంతో సహా ఆసియా దేశాల నుండి వలస వచ్చిన వారిని అమెరికా బహిష్కరిస్తున్నందున, తాత్కాలిక ఆశ్రయాన్ని సిద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కోస్టారికా మంగళవారం అధికారికంగా ప్రకటించింది. మొదటి దశలో 200 మంది ప్రయాణికులతో కూడిన విమానం బుధవారం దేశంలోని జువాన్ శాంటామారియా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటుంది.

# తాళం వేసిన ఇండ్లే టార్గెట్

## రూ.11 లక్షల విలువ గల సొత్తు రికవరీ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 : తాళం వేసిన ఇండ్లనే టార్గెట్‌గా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ఘరానా దొంగ మిట్టపల్లి లక్ష్మణ్‌ను మల్లాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం మెటపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిరంజన్ రెడ్డి వివరాలను వెల్లడించారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ విజయ్(28) అను అతను నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాలో దొంగతనాలకు పాల్పడ్డాడు. వివిధ పోలీస్ స్టేషన్స్ పరిధిలో ఇప్పటి వరకు 40 కేసులు నమోదవగా పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. గత కొంతకాలంగా మెటపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో మల్లాపూర్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం ముత్యంపేట నిజాం చెక్కర ఫ్యాక్టరీ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్ పై వస్తున్న అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రూ.11 లక్షల విలువగల 103 గ్రాముల బంగారం 125.3 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకొని సొత్తును రికవరీ చేసిన మల్లాపూర్ ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రాములు అభినందించారు.

# కుంభమేళాతో అయోధ్య, వారణాసిలకు తాకిడి

## భారీగా తరలిసవ్తున్న భక్తులతో జనసంద్రం

## రామాలయ పనులకు తీవ్ర అంతరాయం



**అయోధ్య, ఫిబ్రవరి 19:** మహాకుంభమేళా సందర్భంగా వారణాసి, అయోధ్య రామమందిరానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది. దీంతో ఈ రెండు నరగాల్లో వాహన రాకపోకలు కూడా ఇబ్బందిగా మారాయి. కుంభమేళా తిరుగు ప్రయాణంలో భక్తులు అయోధ్య, వారణాసిలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో అయోధ్య రామమందిరం నిర్మాణ పనులు ఆగిపోయాయని కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. రామాలయ నిర్మాణ పనులు 25 రోజులుగా ఆగిపోయినట్లు ఆయన తెలిపారు. మార్చి నెలలో పూర్తి కావాల్సిన పనులు జూన్ నాటికి అవుతాయని నృపేంద్ర వెల్లడించారు. అయోధ్యలోని రామ జన్మభూమి సముదాయంలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులపై నృపేంద్ర మిశ్రా నేతృత్వంలో రెండు రోజులుగా సమావేశాలు జరుగుతున్నాయి. నిన్న(మంగళవారం) మె?దటి రోజు జరిగిన సమావేశంలో ఆలయానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నృపేంద్ర తెలిపారు. ఆయన నిర్మాణాలు పరిశీలించామని, అలాగే కొన్ని కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. మహాకుంభమేళా సందర్భంగా అయోధ్య బాల రాముడి దర్శనార్థం వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయ దర్శన, నిష్క్రమణ ద్వారాలను విస్తరించాలని ప్రణాళికలు రూపొందించినట్లు నృపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి నిర్మాణ కమిటీలోని ముఖ్య సభ్యులందరూ నేడు ఆలయాన్ని పరిశీలించి చర్యలు చేపడతారని చెప్పారు. అలాగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో భక్తుల బూట్లు, చెప్పులు ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రామ జన్మభూమి సముదాయంలోని 11వ నంబర్ గేట్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అయితే భక్తుల తాకిడి వల్ల గేట్ నంబర్ 3 పనుల పూర్తి ప్రస్తుతం సాధ్యం కాదని చెప్పారు. అయితే ప్రస్తుతం మహాకుంభమేళాకు భక్తుల తాకిడి కొంతమేర తగ్గినందున ఇప్పటికే సిద్ధం చేసిన తులసీదాస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు నృపేంద్ర తెలిపారు. మరోవైపు జూన్ నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని, సెప్టెంబర్ నాటికి ప్రాకార నిర్మాణం పూర్తవుతుందని నిపేంద్ర వెల్లడించారు. కాగా, నేడు జరిగే సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది

# సిరిసిల్ల స్వచ్ఛదనం పచ్చదనంగా ఉండాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పట్టణంలోని పలు వార్డులు, కొత్త చెరువు, రైతు బజార్ పరిశీలన




**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల పట్టణం నిత్యం స్వచ్ఛతగా... పచ్చదనము గా పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు, పాత బస్టాండ్, సంజీవయ్య నగర్, పద్మ నగర్, వెంకంపేట, కార్గిల్ లేక్, కొత్త బస్టాండ్, రైతు బజార్, బైపాస్ రహదారులు, బతుకమ్మ ఘాట్ ను క్షేత్ర స్థాయిలో బుధవారం తనిఖీ చేశారు. సిరిసిల్ల ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ కు కావాల్సిన మరమ్మతులు, మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని ప్రధాన రహదారులు నిత్యం శుభ్రం చేయించాలని, కొత్త చెరువు పరిసరాలు శుభ్రం చేయించాలని, విద్యుత్, నీటి సరఫరా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, చెరువు వద్ద ఉన్న దుకాణాలను పరిశీలించాలని, కొత్త చెరువులోకి, ఇక్కడి నుంచి వరద నీరు వెళ్లేందుకు పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సంజీవయ్య జంక్షన్ అభివృద్ధికి డీపీఆర్ తయారు చేయాలని, పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ అడ్వర్టైజ్మెంట్ పన్ను చెల్లించారా లేదా అని పరిశీలించాలని ఆదేశించారు. పన్ను చెల్లించకుండా ఆ యా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని, పట్టణంలోని అన్ని మురుగు కాలువలు, కార్గిల్ లేక్ పరిసరాలు శుభ్రం చేయించాలని, లేక్ కు కావాల్సిన మరమ్మతులు వెంటనే చేపట్టాలని, అందంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న షటర్లు అద్దెకు ఇచ్చేందుకు వేలం వేయాలని, రైతు బజార్ పరిసరాలు శుభ్రం చేయించాలని, ఆయా రోడ్లలో అనుమతి, లైసెన్స్ లేని దుకాణాలు తొలగించాలని సూచించారు. అన్ని దుకాణాల ట్రేడ్ లైసెన్స్ లు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల వెంట, ఆయా ప్రదేశాల్లో నాటిన మొక్కలు సంరక్షించాలని సూచించారు. పందుల పెంపకం దారులతో సమావేశం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ స్వామి, సిబ్బంది తదితరులున్నారు.

# నూతన అంగన్వాడీ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలి



**ప్రజానావ, కోనరావుపేట:** నూతన అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని వేములవాడ సీడీపీఓ సౌందర్య అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నూతన అంగన్వాడీ నిర్మాణాల (నిమ్మపల్లి, జై సేవాలాల్ ఊరు తండ, ధర్మారం) స్థలాలను పరిశీలించి కాంట్రాక్టర్లతో మాట్లాడారు. అంగన్వాడీ రిపేర్లకు సంబంధించి కేంద్రాల్లో అబ్రిడేషన్, టాయిలెట్స్ పనులకు సంబంధించి గ్రామాలను సందర్శించి పనులు సకాలంలో పూర్తయ్యాలా చూడాలని కాంట్రాక్టర్లతో మాట్లాడారు. మల్కపేట, ధర్మారం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రాల పనితీరుతో పాటు వసతులు, ఆరోగ్య లక్ష్మి పథకం కింద అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు గంగా లక్ష్మి, కనకమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి



- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- విద్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**ప్రజానావ, వేములవాడ:** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూమ్, డార్మెట్రీ, తరగతి గదులు, మెనూ చార్ట్ పరిశీలించి, ఆహార పదార్థాలను సిద్ధం చేస్తుండగా, నాణ్యతను పరిశీలించారు. సిలబస్ ఎక్కడి వరకు పూర్తయింది అనే వివరాలను ఆరా తీశారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం శాత్రాజుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల, అంగన్వాడీలో మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

### అనుమతి పత్రాలతో ఇసుక తరలించాలి

ప్రభుత్వ ఇసుక రీచ్ ల నుంచి అన్ని పత్రాలను వెంట పెట్టుకొని ఇసుకను తరలించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. వేములవాడ లో ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆపి వేబిల్లు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాలను తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనాలు సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తరలించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్ కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**ప్రజానావ, సిరిసిల్ల:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సన్నద్దత పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మొత్తం వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లు మరోసారి వినియోగించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని, మనకు అవసరమైన వసతుల ఇండెంట్ పక్కగా నమోదు చేయాలని సూచించారు. టార్పాలిన్ కవర్లు, గని బ్యాగులు వేయింగ్ యంత్రాలు, తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు వినియోగించుకునేందుకు వీలుగా ఎంత మన దగ్గర అందుబాటులో ఎన్ని ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యాసంగి కోతలకు ముందే హర్వెస్టర్లతో సమావేశం నిర్వహించి సమగ్ర కోతల ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. హార్వెస్టర్లు అవసరమైన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.దాన్యం కేంద్రముల వద్ద అవసరమైన అన్ని వసతులు పకడ్బందీగా ఉండేలా కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న మిల్లర్ల బిల్డింగ్ కెపాసిటీ పెంచాలని, మిల్లింగ్ సామర్థ్యం మేరకు జరగాలని , నిర్దేశిత సమయంలో భారత ఆహార సంస్థకు సరఫరా పూర్తి చేయాలని, ప్రతిరోజు కనీసం 16 గంటల వరకు మిల్లింగ్ జరిగేలా చూడాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ఉన్న స్టాక్ ను తనిఖీ చేయాలని, అక్రమ దాన్యం రవాణాను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లర్ బ్యాంక్ గ్యారెంటీ సమర్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. 2022-23 రబీ రైస్ వేలం వేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఖరీఫ్ 2023-24 సిఎంఆర్ ఎస్ డెలివరీ పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, డి.ఎం. సివిల్ సప్లై అధికారులు రజిత, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరెపల్లిలో శివాజీ జయంతి

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంత్సుత్సవాలను బుధవారం బీజేపీ అర్బన్ మండలాధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్యక్షతన బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, సిల్వేని ప్రశాంత్, గుండెకర్ల లక్ష్మణ్, సోలంకి అరవింద్, సిల్వేని అనురాజ్, నడిగొట్ల రాజేష్, నర్సింగోజు శంకర్, ఎరుగోక్కుల రమేశ్, చల్ల నర్సయ్య, గంట మహేశ్, రెడ్డవెని రాజు, నాగుల సురేశ్, కర్రె పవన్, ప్రశాంత్ యాదవ్, సంజీవ్ రెడ్డి, పోచంపల్లి భాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉద్యమ నాయకులను గెలిపించండి

**ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఐక్యవేదిక అభ్యర్థి వై.అశోక్ కుమార్**

ప్రజానావ, సిరిసిల్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన రాజకీయాలను ఓడించి, ఉద్యమ నాయకులను గెలిపించాలని కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఐక్యవేదిక అభ్యర్థి వై. అశోక్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన ఉన్న తనకు ఓటు వేయాలని కోరారు. నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ వ్యాపారులు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ వారిని గెలిపిస్తే ప్రభుత్వ పాఠశాలను మూసివేసే విధానాలకు మద్దతు తెలుపుతారని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉపాధ్యాయులకు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. 35ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ జేఏసీ చైర్మన్‌గా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఉపాధ్యాయ రంగ సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కేజీబీవీ సిబ్బందికి మినిమం టైం స్కేల్ వర్తింపజేయడంలో శాయశక్తుల కృషి చేస్తానని, సీపీఎస్ రద్దు గురించి మండలిలో ప్రశ్నించే గొంతుక అవుతానన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించే విధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి ఓటు హక్కు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దుమాల రమనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు పరకాల రవీందర్, ప్రధాన కార్యదర్శి జెంగిటి రాజు, ఎస్సీ ఎస్టీ యూనియన్ అధ్యక్షుడు పిట్టల దేవరాజు, ప్రధాన కార్యదర్శి అజయ్, బీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల రాజలింగం, టీజీజేల 475 అధ్యక్షులు సామల వివేకానంద, టీజీఓ మైనార్టీ అధ్యక్షుడు జబి, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్తు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దబ్బెడ హనుమాన్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# నాపై ఎలాంటి కేసుల్లేవు

- అసత్య ప్రచారాలు చేసేవారిపై కేసు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజానావ, సిరిసిల్ల:** వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ఝా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పై వివిధ కేసులు ఉన్నట్లుగా సామాజిక మాధ్యమాల లో అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, తనపై ఎటువంటి కేసులు లేవని, తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా చేస్తున్న వారి పై, అసత్యాలను ప్రచారం చేస్తున్న వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటానని , ఇప్పటికే కొంతమందిపై కేసులను నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# అధికారులను కించపరిచేలా పోస్టులు

- పలువురిపై కేసు నమోదు

**ప్రజానావ, సిరిసిల్ల:** అధికారులను కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. టౌన్ సీఐ మాట్లాడుతూ జిల్లా అధికారులను కించపరిచేవిధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసిన గుండారపు గణేశ్, ఆకుల శ్రీనివాస్ రెడ్డిపై కేసులు నమోదు చేయడంతో పాటు మరి కొంతమందిపైనా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లా అధికారుల గురించి, వారి వ్యక్తిగత విషయాలకు సంబంధించి అసభ్యకర పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. అధికారులు, ఇతరులను కించపరిచేలా వారి మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా సీఐ తెలిపారు.



బీజేపీ రాజన్న సిరిసిల్ల నూతన జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన రెడ్డబోయిన గోపీని వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండెకర్ల లక్ష్మణ్, పోచంపల్లి భాను, నాంపల్లి అరవింద్, కాచం నిఖిల్, బొల్లు తిరుపతి, జింక శేఖర్, సోలంకి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజానావ, వేములవాడ

# గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

- రికార్డులను పరిశీలించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**ప్రజానావ, గంభీరావుపేట:** గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, స్టేషన్ పరిధిలో నమోదవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదుల్లో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతిరోజూ తనిఖీ చేయాలని,స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరచూ గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ ప్రజలకు చట్టాల మీద, డయల్100, షీ టీమ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని అధికారులు అందరూ విధులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపాలని , పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ లు నిర్వహించి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.





మహాశివరాత్రి జాతర నేపథ్యంలో వేములవాడ రాజన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఆలయ పార్కింగ్ ప్రాంతంలో శివార్చన, ప్రత్యేక క్యూలైన్స్, ధర్మగుండం సమీపంలో అభివృద్ధి పనులు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సామాన్య భక్తులకు వేగంగా దర్శనమయ్యే విధంగా కృషి చేస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నారు. అందరి సహకారంతో విజయవంతం చేస్తామన్నారు. కమాన్లు, గోపురాలకు విద్యుత్ దీపాలు, పార్కింగ్ ఏరియా, సైన్ బోర్డ్స్ పనులను ఈఈ రాజేష్ పరిశీలించారు. వీరి వెంట డీఈ మైపాల్ రెడ్డి, ఏఈ రామ్ కిషన్ రావు తదితరులున్నారు.

- ప్రజానావ, వేములవాడ





వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి 15 రోజుల హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ.1,69,76,867 నగదుతో పాటు 116 గ్రాముల 000 మిల్లి గ్రాముల బంగారం, వెండి 09 కిలోల 800 గ్రాములు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి వినోద్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఎస్పీఎఫ్ హెూం గార్డు సిబ్బంది భద్రత మధ్య నిర్వహించారు. ఈ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, శివ రామకృష్ణ భజన మండలి సేవా పాల్గొన్నారు.

- ప్రజానావ, వేములవాడ

# శివరాత్రి మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు
- 26 నుంచి 28 వరకు జాతర నిర్వహణ



**ప్రజానావ, ములుగు ప్రతినిధి:** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహా శివరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా డీఎస్పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేశ్, రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో, ఆయా శాఖల అధికారులతో కలిసి జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, తాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, హెల్ప్ సెంటర్ ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల పై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26నుంచి 28వ తేదీ వరకు మహా శివరాత్రి మహోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, రామప్పకు వచ్చే అన్ని రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చలి వేంద్రాలను, చలువ పందిరిలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాల్లో అన్ని పందిళ్ల వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల దొంగల ముఠా పట్టివేత



**ప్రజానావ, బెల్లంపల్లి:** గొర్రెల దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు కన్నెపల్లి పోలీసులు తెలిపారు. 33 గొర్రెలు దొంగతనానికి గురైనట్టు బాధితుడు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కన్నెపల్లి సబ్ స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు జంకాపూర్ గ్రామానికి చెందిన అల్లి ప్రశాంత్, ముసుకుల సంతోష్ ,అనంతుల అభిలాష్, వనపర్తి సత్తన్న అనే నలుగురు వ్యక్తులు బొలెరో వాహనంలో గొర్రెలను అనుమానాస్పదంగా తరలిస్తుండగా పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

# ఉద్యోగం విలువను గుర్తించాలి



**ప్రజానావ, మందమర్రి:** గైర్హాజర్ కార్మికులు ఉద్యోగం విలువను గుర్తించాలని కేకే5 గని మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కేకే5 గనిపై గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. సింగరేణిలో ఏ సంస్థలో లేని వేతనాలు, సౌకర్యాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో నిరుద్యోగులు ఉపాధి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సింగరేణి ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలను కలిగి ఉన్నారు కనుక, విధులకు సక్రమంగా హాజరై ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. లేనిచో ఉపాధిని కోల్పోయి రోడ్డున పడతారని ఆయన కోరారు. ఏవైనా అనారోగ్య సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారికి ఆరోగ్యం కుదుటపడే వరకు సర్ఫేస్ జాబ్ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి రమేష్, సంక్షేమ అధికారి ఆకుల రవళి, ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి సాయం

**ప్రజానావ, బెల్లంపల్లి :** బెల్లంపల్లి హనుమాన్ బస్తికి చెందిన గోడుగు కనకయ్య ఇటీవల మృతి చెందగా, బుధవారం నిర్వహించిన పెద్దకర్మలో 1992 -1993 పదవ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు రూ.21వేల సాయాన్ని స్నేహితుడి కుటుంబానికి అందజేశారు. వీరందరి సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేశారు.





# న్యాయ కళాశాల కోసం ఉద్యమిద్దాం

**గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి**

**ప్రజానావ, ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ఆర్ఎంబీ విశ్రాంతి భవనం ఆవరణంలో ఆదివాసీ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. భద్రాచలం కేంద్రంగా ఆదిమ జాతుల కోసం, న్యాయ కళాశాల కోసం మరో న్యాయ పోరాటంలో భాగంగా మార్చి 9న వెంకటాపురం మండల కేంద్రంలో కాపేడ్ గ్రౌండ్ లో ఆదివాసీ న్యాయ నిపుణులు, ఆదివాసీ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సదస్సును జయప్రదం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత అడవి బిడ్డల విద్యారంగంలో ముందుకు రాణించాలని, ప్రత్యేక దృక్పథంతో సుమారు నాలుగు దశాబ్దాలుగా అడవి బిడ్డలుగా ఆలుపెరగని పోరాటాలు కొనసాగించిన ఘనత గొండ్వాన సంక్షేమ పరిషత్ దక్కిందన్నారు. ప్రత్యేక ఉద్యమ సంఘంగా ఆదిమ జాతులకు సేవలందించిన చరిత్ర జీఎస్పీకి ఉందన్నారు. ఆదిమ జాతుల సంక్షేమాన్ని అభివృద్ధిని మనస్ఫూర్తిగా కాంక్షించిన ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ఖమ్మం జిల్లా కలెక్టర్ ఏ.గిరిధర్ జీఎస్పీ పోరాటాలను గుర్తించి ఆదిమ విద్యార్థులను విద్య రంగంలో వెన్ను దన్నుగా నిలిచారని గుర్తుచేశారు. ఉద్యోగ రంగంలో ఆదివాసులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ఆనాటి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జీవో నెంబర్ 3 అమలు పరచాలి ప్రత్యేక కృషి చేసిన ఘనత నాటి కలెక్టర్ గిరిధర్‌కి తగ్గిందని, వారి వల్లే భద్రాచలంలో జూనియర్ డిగ్రీ కాలేజీలలో 6శాతం రిజర్వేషన్ నుంచి జీవో నెంబర్ 267 ద్వారా 100 శాతం అమలుకు నోచుకుందని ఆయన అన్నారు. అప్పటి ఐటీడీఏ పీవో ప్రవీణ్ ప్రకాశ్ ఐఏఎస్, అప్పటి జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి వల్ల భద్రాచలం కేంద్రంలోని టీటీసీ బీఎడ్ కాలేజీలు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, బొచ్చ నరసింహారావు, కాక శేఖర్, జయబాబు, కారం రాజాబాబు, పర్శిక అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# శివాజీకి ఘన నివాళి

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని కంటెస్టెడ్ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భండా రైల్వే గేట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహకులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన వీరుడు.. హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన ధీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి డాన్ రాజు, బోదాస్ నాగార్జున, గుంజ ఆంజనేయులు, ఎండీ వల్లి, కిరణ్ శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- ప్రజానావ, ఖైరతాబాద్

# గంజాయి నిందితులపై నిఘా



**ప్రజానావ, సిరిసిల్ల:** గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందుతులుగా ఉన్న వారిపై పటిష్ట నిఘా ఉంచినట్లు, ఈ క్రమంలో జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో టెస్టులు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి 22 కేసుల్లో 48మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి 2.200 గ్రాముల గంజాయి, 12 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసిన వారి సమాచారం ఆర్ఎస్-ఎన్ఏబీ 8712656392 నెంబర్ కి అందించాలని ఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# మతోన్మాద శక్తులతో పోరాడిన వీరుడు ఛత్రపతి శివాజీ

**బీజేపీ సీనియర్ నేతలు వుట శశిశేఖర్, మల్లికార్జున గౌడ్**

**ప్రజానావ, జూబ్లీహిల్స్:** మతోన్మాద శక్తులతో పోరాడిన వీరుడు ఛత్రపతి శివాజీ అని, అలాంటి పోరాట యోధుడి జయంతిని ఆంక్షల నడుమ నిర్వహించడం దురదృష్టకరమని బీజేపీ సీనియర్ నేతలు వుట శశిశేఖర్, మల్లికార్జున గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఫిలింనగర్ దీన్ దయాల్ నగర్ చౌరస్తాలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేవైఎం నాయకులు మంజలి నరసింహ, గుంటి ఆనంద్ సాగర్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ వీరుడి జయంతి నిర్వహించుకునే స్వేచ్ఛ ఈ దుర్మార్గమైన కాంగ్రెస్ ప్రభుత్వంలో లేదని, బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు అధికారికంగా సెలవు దినంగా ప్రకటిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు బోయ రామాంజనేయులు, గందె అరుణ్ కుమార్, దండుగుల శేఖర్, గణేశ్ యాదవ్, పురుషోత్తం, డోంగరి రాజకళ, దండుగుల మారెమ్మ, పారిజాతం, వరికుప్పల మహేశ్, సత్యనారాయణ ముదిరాజు, వలిశెట్టి రాంబాబు, హనుమంతు ముదిరాజు, ముద్దంగుల అంజి రాజు, ప్రవీణ్ రెడ్డి, హరీశ్, వరికుప్పల వెంకటేశ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





# ఓటమితో స్టార్ట్

## తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ పరాజయం

## అన్ని విభాగాల్లో విఫలమైన ఆతిథ్య జట్టు

### సెంచరీలతో చెలరేగిన కివీస్ బ్యాటర్లు విల్‌యంగ్, టామ్ లాథమ్

**కరాచీ:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని ఆతిథ్య జట్టు పాకిస్థాన్ ఓటమితో ప్రారంభించింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన పాకిస్థాన్ 60 పరుగులు భారీ తేడాతో ఓటమిపాలైంది. దాదాపు 29 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్.. అనూహ్య ఓటమితో తమ అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 330 పరుగుల భారీ స్కోర్ చేసింది. విల్ యంగ్(113 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 107), టామ్ లాథమ్(104 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 118 నాటౌట్) సెంచరీలతో చెలరేగారు. గ్లేన్ ఫిలిఫ్స్((39 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) విధ్వంసకర హాఫ్ సెంచరీతో రాణించాడు. పాకిస్థాన్ బౌలర్లలో నసీమ్ షా(2/63), హ్యారీస్ రౌఫ్(2/80) రెండేసి వికెట్లు తీయగా.. అబ్రర్ అహ్మద్ ఓ వికెట్ పడగొట్టాడు.



#### శుభారంభం లేదు..

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఆదిలోనే ఓపెనర్ డెవాన్ కాన్వే(10)ను స్పిన్నర్ అబ్రర్ అహ్మద్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ మరుసటి ఓవర్‌లోనే కేన్ విలియమ్సన్(1)ను నసీమ్ షా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి పవర్ ప్లేలోనే న్యూజిలాండ్ 2 వికెట్లు కోల్పోయి 48 పరుగులే చేసింది. క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్(10)ను హ్యారీస్ రౌఫ్ క్యాచ్ ఔట్ చేశాడు. ఓవైపు వికెట్లు పడినా మరోవైపు ఆచితూచి ఆడిన విల్ యంగ్ 56 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

#### విల్ యంగ్ విధ్వంసం..

అతనికి జత కలిసిన టామ్ లాథమ్ పాక్ బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచాడు. వీరిద్దరూ వీలు చిక్కిన బంతులను బౌండరీలకు తరలించారు. ముఖ్యంగా స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే విల్ యంగ్ 107 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఆ కాసేపటికే టామ్ లాథమ్ 61 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. సెంచరీ అనంతరం ధాటిగా ఆడే క్రమంలో విల్ యంగ్.. నసీమ్ షా బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 118 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

#### బాబర్ ఆజామ్ జిడ్డు బ్యాటింగ్..

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాక్ బ్యాటర్లలో సౌద్ షకీల్(4), మహమ్మద్ రిజ్వాన్(3), ఫకార్ జమాన్(24), తయ్యబ్ తహీర్(1), షాహిన్ షా అఫ్రిది(14) తీవ్రంగా నిరాశపర్చారు. బాబర్ ఆజామ్ జిడ్డు బ్యాటింగ్‌తో పాకిస్థాన్ విజయవకాశాలను దెబ్బతీసాడు. క్రీజులో సెట్ అయిన తర్వాత కూడా బాబర్ ఆజామ్ దూకుడుగా ఆడే ప్రయత్నం చేయలేదు. ఆచితూచి ఆడిన అతను 81 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఆ తర్వాతే వేగంగా ఆడే ప్రయత్నం చేసి ఔటయ్యాడు. బాబర్ జిడ్డా బ్యాటింగ్‌తో మరో ఎండ్‌లో దూకుడుగా ఆడబోయి రిజ్వాన్, ఫకార్ జమాన్, సల్మాన్ అఘా వికెట్లు పారేసుకున్నారు. బాబర్ ఆజామ్ దూకుడుగా ఆడకున్నా కనీసం 100 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసినా ఫలితం మరోలా ఉండేది. కానీ పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న బాబర్ ఆజామ్.. హాఫ్ సెంచరీ నమోదు చేయాలనే లక్ష్యంతోనే బ్యాటింగ్ చేసినట్లు కనిపించింది.

#### సెమీస్ కష్టమే..

అనంతరం పాకిస్థాన్ 47.2 ఓవర్లలో 260 పరుగులకు కుప్పకూలి ఓటమిపాలైంది. కుష్దిల్ షా(49 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 69 ), బాబర్ ఆజామ్(90 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 64) హాఫ్ సెంచరీలతో రాణించగా.. సల్మాన్ అఘా(28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ బౌలర్లలో విల్ రూర్కీ(3/47), మిచెల్ సాంట్నర్(3/66) మూడేసి వికెట్లు తీయగా.. మ్యాట్ హెన్రీ(2/25) రెండు వికెట్లు పడగొట్టాడు. నాథన్ స్మిత్, మైకేల్ బ్రేస్‌వెల్ తలో వికెట్ తీసారు. ఈ ఘోర పరాజయం పాకిస్థాన్ సెమీస్ అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్‌కు ఇది వరుసగా మూడో పరాజయం.

#### స్కోర్‌బోర్డు:

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** విల్ యంగ్ (సీ) ఫాహిమ్ అష్రాఫ్ (బీ) నసీమ్ షా 107, కాన్వే (బీ) అబ్రర్ అహ్మద్ 10, విలియమ్సన్ (సీ) రిజ్వాన్ (బీ) నసీమ్ షా 1, డారిల్ మిచెల్ (సీ) షాహీన్ అఫ్రిది (బీ) హ్యారీస్ రౌఫ్ 10, లాథమ్ (నాటౌట్) 118, గ్లెన్ ఫిలిప్స్ (సీ) ఫకార్ జమాన్ (బీ) హ్యారీస్ రౌఫ్ 61, మైకేల్ బ్రాస్‌వెల్ (నాటౌట్) 0. ఎక్స్‌ట్రాలు: 13, మొత్తం: 320 (50 ఓవర్లలో 5 వికెట్లకు)

**బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 10-0-68-0, నసీమ్ షా 10-0-63-2, అబ్రర్ అహ్మద్ 10-0-47-1, హ్యారీస్ రౌఫ్ 10-0-83-2, ఖుష్‌దిల్ 7-0-40-0, సల్మాన్ అఘా 3-0-15-0.

**వికెట్ల పతనం:** 39-1 (కాన్వే, 7.3), 40-2 (విలియమ్సన్, 8.1), 73-3 (డారిల్ మిచెల్, 16.2), 191-4 (విల్ యంగ్, 37.2), 316-5 (గ్లెన్ ఫిలిప్స్, 49.4)

**పాకిస్థాన్ ఇన్నింగ్స్:** సౌద్ షకీల్ (సీ) మాట్ హెన్రీ (బీ) విలియమ్ ఓ రూర్కీ 6, బాబర్ ఆజామ్ (సీ) విలియమ్సన్ (బీ) సాంట్నర్ 64, మహ్మద్ రిజ్వాన్ (సీ) గ్లెన్ ఫిలిప్స్ (బీ) విలియమ్ ఓ రూర్కీ 3, ఫకార్ జమాన్ (బీ) మైకేల్ బ్రాస్‌వెల్ 24, సల్మాన్ అఘా (సీ) మైకేల్ బ్రాస్‌వెల్ (బీ) నాథన్ స్మిత్ 42, తయ్యాబ్ తాహిర్ (సీ) విలియమ్సన్ (బీ) సాంట్నర్ 1, కుష్దిల్ షా (సీ) మైకేల్ బ్రాస్‌వెల్ (బీ) విలియమ్ ఓ రూర్కీ 69, షాహిన్ అఫ్రిది (సీ) లాథమ్ (బీ) మ్యాట్ హెన్రీ 14, నసీమ్ షా (బీ) మ్యాట్ హెన్రీ 13, హ్యారీస్ రౌఫ్ (సీ) డారిల్ మిచెల్ (బీ) సాంట్నర్ 19, అబ్రర్ అహ్మద్ (నాటౌట్) 0. ఎక్స్‌ట్రాలు: 5.

**మొత్తం: 260 (47.2 ఓవర్లలో ఆలౌట్)**

**బౌలింగ్:** మ్యాట్ హెన్రీ 7.2-1-25-2, విలియమ్ ఓ రూర్కీ 9-0-47-3, మైకేల్ బ్రాస్‌వెల్ 10-1-38-1, గ్లెన్ ఫిలిప్స్ 9-0-63-0, మిచెల్ సాంట్నర్ 10-0-66-3, నాథన్ స్మిత్ 2-0-20-1.

**వికెట్ల పతనం:** 8-1 (సౌద్ షకీల్, 3.4), 22-2 (మహ్మద్ రిజ్వాన్ 9.6), 69-3 (ఫకార్ జమాన్, 20.5), 127-4 (సల్మాన్ అఘా, 30.4), 128-5 (తయ్యాబ్ తహిర్, 31.3), 153-6 (బాబర్ ఆజామ్, 33.6), 200-7 (షాహీన్ అఫ్రిది, 40.6), 229-8 (కుష్దిల్ షా, 43.4), 260-9 (హ్యారీస్ రౌఫ్, 46.6), 260-10 (నసీమ్ షా, 47.2)





# టీపీఎల్ నిర్వహణకు ఎస్ఆర్‌హెచ్ సహకారం

- రాష్ట్రంలో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు
- ఉప్పల్ స్టేడియంలో మల్టీ లెవల్ పార్కింగ్‌కు కసరత్తు
- ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై సమన్వయ సమావేశం
- టిక్కెట్లు పారదర్శకంగా విక్రయించాలని సూచించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు
- వచ్చే నెల 2న ఐపీఎల్ ఏర్పాట్లపై ఉప్పల్ స్టేడియం పరిశీలన

**హైదరాబాద్ స్పోర్ట్స్:** తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) నిర్వహించేందుకు సహకారం అందించాలని సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టు యాజమాన్యాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు కోరారు. బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఎస్‌ఆర్‌హెచ్ జట్టు యాజమాన్యంతో జరిగిన సమన్వయ సమావేశంలో జగన్‌మోహన్ రావు, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు, కోశాధికారి సీజే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానంగా రాష్ట్రంలో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎస్‌ఆర్‌హెచ్‌కు జగన్‌మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. అలాగే ఐపీఎల్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉప్పల్‌లో మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఎస్‌ఆర్‌హెచ్ నుంచి సహకారం కావాలని కోరారు. టీపీఎల్ నిర్వహణ, రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి కార్యక్రమాలకు తమ వైపు నుంచి సంపూర్ణ సహకారమందిస్తామని ఎస్‌ఆర్‌హెచ్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఉప్పల్‌లో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణంపై అంచనాలు రూపొందిస్తే వచ్చే ఏడాది పనులు ప్రారంభించేందుకు తమ వంతు సహాయం అందిస్తామని ఎస్‌ఆర్‌హెచ్ బృందం తెలిపింది. ఇక ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం పూర్తి పారదర్శకంగా జరగాలని, స్టేడియంలో తినుబండారాలను, శీతల పానియాలను సాధారణ రేట్లకే అమ్మాలని ఎస్‌ఆర్‌హెచ్ బృందానికి జగన్‌మోహన్ రావు సూచించారు. వచ్చే నెల 2న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు- ఎస్‌ఆర్‌హెచ్ బృందం సంయుక్తంగా ఐపీఎల్ ఏర్పాట్లపై స్టేడియం మొత్తాన్ని పరిశీలించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఆర్‌హెచ్ నుంచి సీఈఓ షణ్ముగం, డైరెక్టర్ కిరణ్, జీఎం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనర్ నిర్లక్ష్యం..

## 17 ఏళ్ల వెయిట్ లిఫ్టర్ మృతి!

### రాజస్థాన్‌లో ఘటన.. వైరల్‌గా మారిన వీడియో



బికనీర్: ట్రైనర్ నిర్లక్ష్యం కారణంగా ఓ యువ మహిళా వెయిట్ లిఫ్టర్ మృతి చెందింది. ఈ అనూహ్య ఘటన రాజస్థాన్‌లోని బికనీర్‌లో చోటు చేసుకుంది. ఈ సంఘటన యావత్ క్రీడా లోకాన్ని కలవరపాటుకు గురి చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. బికనీర్‌కు చెందిన యష్తికా ఆచార్య అనే 17 ఎళ్ల అమ్మాయి.. వెయిట్ లిఫ్టర్‌గా కెరీర్‌ను ఎంచుకుంది. జూనియర్ నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు రేపింది. విశ్వక్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించాలని కలలు కన్నది. ఆమె ప్రతిభను చూసిన జనాలు కూడా గొప్ప వెయిట్ లిఫ్టర్ అవుతుందని భావించారు. కానీ ట్రైనర్ నిర్లక్ష్యం ఆమె ప్రాణాలను బలిగొన్నది. భారత స్టార్ వెయిట్ లిఫ్టర్‌గా ఎదగాలనుకున్న ఆ టీనేజర్ ప్రయాణం మధ్యలోనే ఆగిపోయింది. యష్తికా జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తూ ట్రైనర్ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయింది. రోజువారి ప్రాక్టీస్‌లో భాగంగా 270 కిలోల బరువు ఎత్తే ప్రయత్నంలో బ్యాలెన్స్ కోల్పోవడంతో స్క్వాట్ రాడ్ జారి ఆమె మెడపై పడింది. దాంతో ఆమె మెడ విరిగి ప్రాణాలను కోల్పోయింది. ఆమె వెనకాలే ట్రైనర్, పక్కనే ఇతర లిఫ్టర్లు ఉన్నా కూడా ఏం చేయలేకపోయారు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు సదరు ట్రైనర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. యష్తికా మరణానికి అతనే కారణమని మండిపడుతున్నారు. యష్తికా అకాల మరణంపై క్రీడా ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అనుభవం, నైపుణ్యం కలిగిన ట్రైనర్ల వద్దే శిక్షణ తీసుకోవాలని సూచిస్తున్నారు.

# రెపరెపలాడిన మువ్వన్నెల పతాకం

### కరాచీ స్టేడియంపై ఎగిరిన భారత్ జెండా ● నెట్టింట వైరల్‌గా మారిన వీడియో, ఫొటోలు

**కరాచీ:** శత్రు దేశం పాకిస్థాన్ గడ్డపై ఎట్టకేలకు భారత మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. కరాచీ స్టేడియం వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఘనంగా ప్రారంభమైంది. ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ సందర్భంగా కరాచీ స్టేడియం పైకప్పుపై ఈ టోర్నీలో బరిలోకి దిగిన 8 దేశాల జెండాలను ఎగరవేసారు. అయితే రెండు రోజుల క్రితం జెండా వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. కరాచీ, లాహోర్ మైదానాల్లో భారత్ జెండాను పీసీబీ ఎగరవేయలేదు. మిగతా ఏడు జట్ల జెండాలను ఎగరవేసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై భారత అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. పీసీబీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ తన నీచ బుద్ధిని బయటపెట్టుకుందని మండిపడ్డారు.

#### అందుకే ఎగరవేయలేదు..

ఈ టోర్నీ కోసం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించకపోవడంతోనే పీసీబీ జెండాను ఎగరవేయలేదని ఆ దేశ నెటిజన్లు, జర్నలిస్ట్‌లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పీసీబీ కూడా స్పందించింది. 'ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్థాన్‌కు భారత్ రావట్లేదు. కరాచీ, రావల్పిండి, లాహోర్ స్టేడియాల్లో మ్యాచ్‌లు ఆడుతున్న జట్ల జెండాలను మాత్రమే ఎగరవేశాం. భారత్ తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. బంగ్లాదేశ్ కూడా ఇంకా పాకిస్థాన్‌కు రాలేదు. ఆ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత్‌తో ఆడనుంది. కాబట్టి భారత్, బంగ్లాదేశ్ జెండాలను ఇంకా ఎగరవేయలేదు. పాకిస్థాన్‌కు వచ్చిన మిగతా జట్ల జాతీయ పతకాలను మాత్రమే ఎగరవేసాం. ఈ జెండాల గురించి పీసీబీ అధికారికంగా స్పందించాల్సిన అవసరం లేదు' అని ఆ బోర్డు వర్గాలు మీడియాకు తెలిపాయి.


#### బీసీసీఐ ఆగ్రహం..

ఈ వ్యవహారంపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. టోర్నీలో భాగమయ్యే అన్ని దేశాల జెండాలను ఎగరవేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా భారత జెండా ఎగరవేయాలని పేర్కొన్నారు. ఇక తొలి మ్యాచ్ సందర్భంగా భారత జెండాను ఎగరవేసి ఈ వివాదానికి పీసీబీ ముగింపు పలికింది. ప్రస్తుతం కరాచీ స్టేడియం ఎగురుతున్న భారత జెండా వీడియో, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆటగాళ్ల భద్రతను కారణంగా చూపిస్తూ పాకిస్థాన్‌లో



పర్యటించేందుకు బీసీసీఐ అభ్యంతరం చెప్పిన విషయం తెలిసిందే. దాంతో ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేలా పీసీబీని ఐసీసీ ఒప్పించింది. ఇందుకుగానూ బీసీసీఐ-పీసీబీల మధ్య ఓ ఒప్పందం జరిగింది. భారత్ వేదికగా జరిగే ఐసీసీ టోర్నీల్లోనూ తమ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించాలని పీసీబీ కోరగా.. అందుకు బీసీసీఐ అంగీకరించింది.

# ప్రభాస్ స్పిరిట్ ప్రాజెక్టులో డైరెక్టర్ వంగా కండీషన్స్




అగ్ర కథానాయకుడు ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్'. దాదాపు రూ. 300 కోట్లకు పైగా బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రం ఈ ఏడాది సమ్మర్‌లో సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తుంది. ఇదిలావుంటే ఈ సినిమా కోసం దర్శకుడు సందీప్ వంగా నటినటులందరికి కండిషన్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే రాజమౌళి ఎస్ఎస్ఎంబి ప్రాజెక్ట్ కోసం చిత్రబృందానికి కండిషన్స్ పెట్టిన విషయం తెలిసిందే. రాజమౌళి సినిమా కంప్లీట్ అయ్యేంతవరకు మూవీకి సంబంధించిన ఎటువంటి అప్‌డేట్‌లను బయటపెట్టడానికి వీల్లేదంటూ బాండ్ కూడా రాయించుకున్నాడు రాజమౌళి. అయితే ఇదే పనిని ఇప్పుడు సందీప్ కూడా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్‌తో తెరకెక్కించబోతున్న సినిమాకి సందీప్ కండిషన్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే సినిమాలో నటించే నటినటులతో పాటు హీరో హీరోయిన్లకి కూడా ఎటువంటి అప్‌డేట్స్ బయటపెట్టవద్దని బాండ్ రాసుకోబోతున్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ సినిమాలో ప్రభాస్ లుక్‌కి సంబంధించి కూడా సందీప్ కండిషన్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. మూవీలో ప్రభాస్ లుక్ కీలకం అని.. ఒకవేళ సినిమా షూటింగ్ మధ్యలో లుక్ మార్చుకున్న సినిమాకి ఎఫెక్ట్ పడుతుందని అందుకనే ఏది మార్చకుండా సినిమా అయ్యేవరకు ప్రభాస్ అలానే ఉండలాని సందీప్ ఆలోచిస్తున్నట్లు సమాచారం.



## రాజమౌళి - రష్మీ ఓ సరదా లవ్ ట్రాక్..

భారీ బడ్జెట్ చిత్రాలతో దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు దర్శక ధీరుడు రాజమౌళి. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ ఆయన ప్రేక్షకులకు సుపరిచితమే. 'సై', 'మజ్ను', 'బాహుబలి', 'కల్కి 2898 ఏడీ' వంటి చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించి సినీ ప్రియులను ఆశ్చర్యపరిచారు. గతంలో ఆయన ఓ ధారావాహికలోనూ యాక్ట్ చేశారు. దీనికి సంబంధించిన రేర్ వీడియో వైరల్‌గా మారింది. యాంకర్‌గా గుర్తింపుపొందిన నటి రష్మీ.. కెరీర్ ఆరంభంలో పలు టీవీ సీరియల్స్ కోసం వర్క్ చేసిన విషయం తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో యాక్ట్ చేసిన సీరియల్ 'యువ'. యూత్‌ఫుల్ కంటెంట్‌తో నాటి యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సీరియల్‌లో జక్కన్న గెస్ట్ రోల్‌లో కనిపించారు. ఇందులో రాజమౌళి – రష్మీపై ఒక సరదా లవ్ ట్రాక్ ఉంటుంది. 'ఐ లవ్ యూ' అంటూ ఆమె తన మనసులోని మాట చెబుతుంది. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. వీరిద్దరూ ఎప్పుడు నటించారు? ఇదెప్పుడు జరిగిందంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరికొందరేమో ఇది నిజం కాదని.. ఏఐ జనరేటెడ్ వీడియో అని అనుకుంటున్నారు.

## ఐపీఎస్, ఐఎఎస్‌లు పాసవ్వొచ్చు..



సినిమా ఇండ్రస్ట్రీలోకి అమ్మాయిలు రావడంపై ఆసక్తికర విషయాలను పంచుకుంటి నటి ధన్య బాలకృష్ణన్. ఆమె కీలక పాత్రలో వస్తున్న తాజా చిత్రం బాపు ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ.. అనేది ఉపశీర్షిక. సీనియర్ నటులు బ్రహ్మాజీ, ఆమని, బలగం సుధాకర్ రెడ్డి ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ సినిమాకు దయా దర్శకత్వం వహిస్తుండగా.. అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు మేకర్స్. అయితే ఈ వేడుకలో ధన్య మాట్లాడుతూ.. బాపు అనే సినిమా నా కెరియర్‌లో నేను ఎప్పుడూ నా లైఫ్‌లో మర్చిపోని ఒక ప్రాజెక్ట్ ఇది. ఎందు కంటే ఎందుకంటే ఫస్ట్ టైం నా బాపు నాకు ఫోన్ చేసి చాలా గర్వంగా ఉందని చెప్పాడు ఈ సినిమా చేసినందుకు. సిటీ అనేది ఒక శరీరం అయితే పల్లెటూరు అనేది దాని ఆత్మ. అందుకు పల్లెటూరు మీద వచ్చే సినిమాలలో ఒక ఆత్మ దాగి ఉంటుంది. అందుకే మా నాన్న చెబుతుండేవాడు. ఎప్పటికి ఒక పల్లెటూరు కథ చేయమని.. ఇన్ని రోజులకు ఆ కల నేరవేరింది. ముందుగా నేను నటి అవుదాం అనుకుంటున్నాను అని చెప్పినప్పుడు మా నాన్న ఒకే చెప్పినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. సినిమా ఇండస్ట్రీలోకి అమ్మాయిలను పంపించడం అనేది చాలా పెద్ద విషయం. ఇండియాలో అయితే చెప్పాల్సిన పనిలేదు. మేము పాస్ అవ్వొచ్చు కానీ.. అమ్మ నాన్నల్ని ఒప్పించడం వాళ్ళ చుట్టాలు ఉన్న వాళ్ళని ఒప్పించడం అనేది చాలాకష్టం. అలాంటి పరిస్థితుల్లో నాన్న నన్ను నమ్మాడు. నేను ఇండ్రస్ట్రీకి వెళ్లిన అనంతరం కూడా ఎప్పుడు అక్కడ ఎలా ఉంది పరిస్థితి అని అడుగలేదు అంటూ ధన్య చెప్పుకోచ్చింది.





## గ్లామర్ పెంచేసిన వర్షబొల్లమ్మ

చైల్డ్ ఆర్టిస్ట్ గా వెండి తెరకు పరిచయమైంది అందాల భామ వర్ష బొల్లమ్మ. ఆతర్వాత పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది. విజయ్ సేతుపతి హీరోగా నటించిన 96సినిమాలో స్టూడెంట్ గా కనిపించింది. అలాగే దళపతి విజయ్ నటించిన విజిల్ లోనూ ఆకట్టుకుంది. దళపతి విజయ్ విజిల్ సినిమాలో ఫుట్ బాల్ ప్లేయర్ గా కనిపించింది వర్ష. ఇక హీరోయిన్ గా మారిన తర్వాత ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో తన క్యూట్ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ప్రేక్షకులను తన నటనతో ప్రేక్షకుల చూపును తనవైపు తిప్పుకుంది అందాల ముద్దుగుమ్మ వర్ష బొల్లమ్మ. పక్కింటి అమ్మాయిలా కనిపించే రూపంతో ఆకట్టుకుంటూ కుర్రకారును ఫిదా చేస్తోందీ బ్యూటీ.. తెలుగులో రీసెంట్ గా ఊరుపేరు భైరవకోన అనే సినిమాతో హిట్ అందుకుంది. ఈ మధ్య గ్లామర్ మీద కూడా ఫోకస్ పెడుతూ అప్పుడప్పుడు ఫొటోస్ తో ఆకట్టుకుంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ థన్ ఆ బ్యూటీఫుల్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. గ్లామరస్ ఫోటోలతో కుర్రకారుకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ వయ్యారి భామ.

## అందుకే మా పెళ్లిలో నో ఫోన్ పాలసీ పెట్టాం : రకుల్ ప్రీత్ సింగ్

గతేడాది ఫిబ్రవరిలో వివాహబంధంలోకి అడుగుపెట్టారు రకుల్ ప్రీత్ సింగ్. గోవాలోని ఓ రిసార్ట్స్‌లో రకుల్– జాకీ భగ్నానీ పెళ్లి అత్యంత సన్నిహితుల మధ్య జరిగింది. తన పెళ్లిని సింపుల్‌గా ఎందుకు చేసుకున్నారో తాజాగా వివరించారు. పెళ్లిలో నో ఫోన్ పాలసీ పెట్టడానికి కారణం తెలిపారు. "మా పెళ్లిని చాలా సింపుల్‌గా చేసుకోవాలని ఎప్పటినుంచో అనుకున్నాం. లగ్జరీ కంటే సౌకర్యం ముఖ్యం. పెళ్లి జరిగిన విలువైన క్షణాలను ఎంజాయ్ చేశాం. సింపుల్‌గా పెళ్లి చేసుకోవడంలో ఒకరకమైన ఆనందం ఉంటుంది. వివాహం జరిగిన మూడు రోజులు మా జీవితంలో బెస్ట్‌గా ఉండాలనుకున్నాం. వివాహానికి వచ్చిన అతిథులు కూడా ఈ వేడుకను సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నాం. అందుకే నో ఫోన్ పాలసీ పెట్టాం. అంతేకానీ, వాళ్లు మా పెళ్లి ఫొటోలు లీక్ చేస్తారని కాదు. ఈ వేడుక చిత్రాలను మేమే మొదట పంచుకోవాలని నిర్ణయించుకున్నాం. పెళ్లిలోని ప్రతి మూమెంట్‌ను డ్యాన్స్‌తో సెలబ్రేట్ చేసుకున్నాం. పెళ్లి దుస్తుల్లో కూడా డ్యాన్స్ వేశాం" అని రకుల్ తెలిపారు. కన్నడ చిత్రం 'గిల్లీ'తో తెరంగేట్రం చేసిన రకుల్ బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాలతో మెప్పిస్తున్నారు. ప్రస్తుతం 'మేరే హస్బెండ్ కీ బీవీ' తో బిజీగా ఉన్నారు. అర్జున్ కపూర్ హీరోగా రకుల్ ప్రీత్ సింగ్, భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రమిది. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో రూపొందింది. ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకురానుంది. జాకీ భగ్నానీ, వాషు భగ్నానీ సంయుక్తంగా నిర్మించారు.

## ఖుషీ కపూర్ సినిమా పరాజయం.. స్పందించిన రచయిత

ఖుషీ కపూర్, జునైద్ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ యాపా'. కోలీవుడ్‌లో విజయాన్ని అందుకున్న 'లవ్ టుడే' చిత్రానికి రీమేక్‌గా ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే. 'లవ్ యాపా' పరాజయంపై తాజాగా చిత్ర రచయిత స్నేహా దేశాయ్ స్పందించారు. ఇది రొటీన్ లవ్ స్టోరీ కాదని.. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఎక్కువమంది దీనిని చూసే వీలుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రేక్షకులపై ఒక సినిమా ఎలాంటి ప్రభావాన్ని చూపించిందనేది బాక్సాఫీస్ నంబర్లపై ఎప్పుడూ ఆధారపడి ఉండదు. 'లవ్ యాపా' విభిన్నమైన, ఫ్రెష్ లవ్ స్టోరీ. జెన్ జి ప్రేక్షకుల కోసం దీనిని రూపొందించారు. ఇందులోని కంటెంట్, కామెడీకి వారు బాగా కనెక్ట్ అవుతారు. బాలీవుడ్‌లో తెరకెక్కే రొటీన్ రొమాంటిక్ – కామెడీ చిత్రాల మాదిరిగా కాకుండా సరికొత్త సబ్జెట్ మూవీగా దీనిని సిద్ధం చేశాం. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రేక్షకులు సినిమా వీక్షించే కోణంలో ఎన్నో మార్పులు వచ్చాయి. లార్జర్ దెన్ లైఫ్ చిత్రాలను మాత్రమే వారు థియేటర్లలో చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మిగిలిన చిత్రాలను ఓటీటీల్లో చూడాలనుకుంటున్నారు. ఆ కారణం వల్లనే మా సినిమాకు బాక్సాఫీస్ వద్ద సరైన కలెక్షన్స్ వచ్చి ఉండకపోవచ్చు. ఓటీటీలో ఇది తప్పకుండా విశేష ఆదరణ సొంతం చేసుకుంటుందని నమ్ముతున్నా. ఏది ఏమైనా బిగ్‌స్క్రీన్‌పై ఈ చిత్రాన్ని చూసిన వారు తమకు ఈ చిత్రం బాగా నచ్చిందని.. కంటెంట్ చాలా



కొత్తగా ఉందని ప్రశంసలు కురిపించారు" అని ఆమె తెలిపారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే'. నేటితరం యువతీ యువకుల ప్రేమ కథతో దీనిని రూపొందించారు. ఇదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్ యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు. ఫిబ్రవరి 7న ఇది థియేటర్లలో విడుదలైంది.

## రక్తదానం చేసి అభిమానాన్ని చాటుకున్న మణిశర్మ

ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను అభిమానుల దానంతోనే ఈ బృహుత్ కార్యాన్ని నిర్వహిస్తున్నానని చిరంజీవి చెబుతుంటారు. విశేషం ఏమంటే... సాధారణ ప్రజలు, చిరంజీవి అభిమానులే కాదు... సినిమా రంగానికి చెందిన ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు సైతం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేస్తుంటారు. కొంతమంది తమ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి రక్తదానం చేసిన సంఘటనలూ ఉన్నాయి. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి. ఈ సందర్భంగా మణిశర్మ మాట్లాడుతూ "ఎప్పటి నుంచో రక్త దానం చేయాలని అనుకుంటున్నాను. నేను నా సంగీతాన్ని చిరంజీవిగారి సినిమాలకు అందించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నాను. ఇప్పుడు రక్తదానం చేయటం అనేది సంతోషంగా ఉంది. ఇది నా వంతు కర్తవ్యంగా భావిస్తున్నాను. లక్షలాది మంది ఇందులో భాగమయ్యారు. అందులో నేను ఒక బొట్టులాగా భావిస్తున్నాను. ఇలాంటి మంచి కార్యక్రమంలో అందరూ భాగం కావాలి" అన్నారు.




Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**